PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 103 | విజయవాడ, మంగళవారం 14 నవంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 14 November 2023 | Rs

క్రీడా • పేజీలో...

దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మ్యాచ్‌కు

ఫీల్డ్ అంపైర్‌గా నితీన్ మీనన్

- సెమీఫైనల్ అంపైర్ల పేర్లను వెల్లడించిన ఐసిసి

సిపిఎం సీనియర్ నేత

వాసుదేవ్ ఆచార్య కన్నుమూత

- అనారోగ్యంతో హైదరాబాద్‌లో తుది శ్వాస
- పొలిట్‌బ్యూరో సంతాపం
- శ్రామిక ఉద్యమానికి తీరని లోటు: సిఐటియు, ఎఐకెఎస్,వ్యవసాయ కార్మిక సంఘాలు

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో/ కొల్‌కతా: సిపిఎం సీనియర్ నేత , సుదీర్ఘకాలంపాటు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించిన సీనియర్ పార్లమెంటేరియన్ వాసుదేవ్ ఆచార్య (81) సోమవారం హైదరాబాద్‌లోని తన కుమారుడి నివాసంలో కన్నుమూశారు. కొంత కాలంగా వృద్ధాప్య సంబంధిత సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన భౌతిక కాయాన్ని హైదరాబాద్ నుంచి కొల్‌కతాకు తరలించారు.. కేంద్ర కమిటీ మాజీ సభ్యులు, సిపిఐ(ఎం)కంట్రోల్ కమీషన్ ఛైర్మన్‌గా, సిఐటియు నేతగా వివిధ బాధ్యతలను నిర్వర్తించిన ఆచార్య జులై 11, 1942న అప్పటి కూచ్‌బీహార్‌లో భాగమైన పురూలియా జిల్లాలోని అద్రా సమీపంలోని బిరోలో జన్మించారు. ఆచార్య భార్య డీఏవీ స్కూల్‌లో పనిచేసి ఇటీవల మరణించారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య కొంతకాలం క్రితమే చనిపోయారు. హైదరాబాద్‌లో వాసు దేవ ఆచార్య భౌతికకాయాన్ని సిఐటియు అఖిల భారత నాయకులు ఎం సాయిబాబు, సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. వాసుదేవ ఆచార్య మిగతా 2లో

రబీకి సాగునీటి గండం!

- గోదావరిలో అడుగంటిన నిల్వలు
- ఆందోళనలో అన్నదాతలు

కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి (ఫైల్)

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉభయ గోదావరి జిల్లాల్లో రబీకి సాగునీటి లభ్యతపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఓ వైపు ఖరీఫ్‌లో ఎదురైన తీవ్ర వర్షాభావ పరిస్థితులు, మరోవైపు నదిలో నీటిమట్టం గణనీయంగా తగ్గిపోవడం వంటి పరిణామాలు వారికి కంటిపై కునుకులేకుండా చేస్తున్నాయి. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో ఏటా డిసెంబరు 15 నుంచి రబీ పంటల సాగు ప్రారంభం అవుతుంది. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలకు ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ కింద 8.96 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని ఆయకట్టు 4.30 లక్షల ఎకరాలు. డిసెంబరు నుంచి మార్చి వరకు 92 టిఎంసిల నీరు అవసరం. ప్రస్తుతం ధవళేశ్వరం కాటన్ బ్యారేజీలో 2.7 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. గోదావరి ఎగువన రెండు ప్రాజెక్టుల నుంచి నీరు వచ్చే అవకాశం ఉన్నందున 82 టిఎంసిలు రబీకి అందుబాటులో ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అయినా, ఇంకా పది టిఎంసిల కొరత ఏర్పడనుంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

వంతుల వారీ విధానం అమలు, నీటి వృథాను అరికట్టడం వంట చర్యలు చేపట్టే అవకాశాన్ని ప్రతిపాదించనున్నట్లు తెలుస్తోంది. రబీ పంట గట్టెక్కాలంటే ప్రత్యామ్నాయ మార్గాల్లో నీటి లభ్యతకు రూ.10 కోట్లు అవసరమని అంచనా వేస్తున్నారు. ఈ నిధులతో పంట, మురుగు కాల్వలకు అడ్డుకట్టలు వేయడం, యంత్రాలతో నీటిని తోడిపోయడం వంటివి చేపట్టాల్సి ఉంటుంది. గతేడాది సాగునీటి సలహా మండలి (ఐఎబి) సమావేశాలు నిర్వహించి కాలువల ఆధునీకరణ, స్లూయిజ్‌లు ఏర్పాటు, డ్రెయిన్ల పూడికతీత పనులకు సుమారు రూ.60 కోట్లతో అంచనాలను అధికారులు రూపొందించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ నిధులు గుర్రపు డెక్క తొలగింపు, అక్కడక్కడక్కడా కాలువల మరమ్మతులకు వినియోగించి మమ అనిపించారు. కొన్నేళ్లుగా నిధుల కొరత వేధిస్తుండడంతో ఇరిగేషన్ శాఖ టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఖరీఫ్‌లో కరువు తరుముకొచ్చి మెట్ట రైతులు నష్టాల పాలయ్యారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడదంతో భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో, చివరి తడితో పంటను కాపాడుకునేందుకు జగ్గంపేట, గోకవరం తదితర మండలాల్లో రైతులు చేసిన ప్రయత్నాలు సైతం ఫలించలేదు. రైతులను ఆదుకునేందుకు క్షేత్రస్థాయికి వెళ్లి భరోసా ఇచ్చిన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో రైతులు సాగుకు వెనకడుగు వేస్తున్నారు.

నీటి నుంచి జిల్లాల వారీగా ఐఎబి సమావేశాలు

జిల్లాల వారీగా ఐఎబి సమావేశాలు నిర్వహించనున్నాం. మంగళవారం కాకినాడ జిల్లా, బుధవారం తూర్పుగోదావరి జిల్లా, గురువారం కోనసీమ జిల్లా సమావేశం నిర్వహిస్తాం. గోదావరిలో ప్రస్తుతం 2.7 టిఎంసిల నీటి నిల్వ ఉంది. చర్చల అనంతరం తాగునీటి కేటాయింపులు, రబీ సాగుకు నీరు విడుదల తేదీ ఖరారు, ప్రత్యామ్నాయాలపై నిర్ణయాలు వెల్లడించనున్నాం.

- ఇ.శ్రీనివాసరావు
ఎస్ఇ ఇరిగేషన్ సర్కిల్, ధవళేశ్వరం

హైదరాబాద్‌లో ఘోరం

- అగ్నిప్రమాదంలో తొమ్మిది మంది మృతి
- పలువురికి తీవ్ర అస్వస్థత
- సెల్లార్‌లో అక్రమంగా నిల్వ చేసిన రసాయనాలే కారణం
- తెలంగాణ సిఎం, గవర్నర్ దిగ్భ్రాంతి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

నివాస సముదాయంలో అక్రమంగా నిల్వ చేసిన రసాయనాలు పేలి తొమ్మిది మంది మృతి చెందారు. వీరిలో ఆరుగురు ఒకే కుటుంబానికి చెందిన వారు. పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ప్రమాదంలో చిక్కుకున్న 21 మందిని అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, డిఆర్‌ఎఫ్ బృందాలు కాపాడాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ నాంపల్లి ప్రాంతంలోగల బజార్‌ఘాట్ లోని వ్యాపారవేత్త రమేష్ జైశ్వాల్‌కు చెందిన బాలాజీ రెసిడెన్సీ నాలుగు అంతస్తుల భవనంలో సోమవారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగింది. సెల్లార్ నుంచి రగులుకున్న మంటలు అక్కడ అక్రమంగా ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన బెంజీన్ నైట్రేట్ ద్రావణానికి అంటుకోవడంతో నిమిషాల వ్యవధిలోనే నాలుగు ఫ్లోర్లకు వ్యాపించాయి. మండే గుణం కలిగిన రసాయనాలు కావడంతో మంటల తీవ్రతతోపాటు దట్టమైన పొగలు కమ్మేయడం, పేలుడు సంభవించడంతో అపార్ట్‌మెంట్లోని వారు భయంతో బయటకు పరుగులు తీశారు. అయితే, అప్పటికే మెట్ల మార్గంలో నల్లటి పొగలు కమ్మేయడంతో ఎటు వెళ్లాలో అర్థం కాక 'రక్షించండి. రక్షించడం' అంటూ పలువురు బిగ్గరగా కేకలు చేశారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, జిహెచ్‌ఎంసికి చెందిన డిఆర్‌ఎఫ్ బృందాలు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. అతికష్టమ్మీద భవనం లోపలికి వెళ్లిన రెస్క్యూ టీం మొదటి, రెండు అంతస్తుల్లో అపస్మారక స్థితిలో ఉన్న తొమ్మిది మందిని నిచ్చెల సహాయంతో కిందకి తెచ్చి ఉస్మానియా ఆస్పత్రికి తరలించింది. అయితే, అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మంటల్లో చిక్కుకుని ప్రాణాలతో బైటపడిన 21 మందిలో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ ప్రమాదంలో కొన్ని కార్లు, పలు ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి.

మృతుల్లో ఎండి జకీర్ హుస్సేన్ (66), ఎండి అజాం (57), రెహ్మాన్ సుల్తానా (50), ఫైజా సమీనా (26), తరోబా (13), మన్వ (6), నికత్ సుల్తానా (50), తహురా ఫర్హీమ్ (35), హజేబుర్ రెహ్మాన్ (32) ఉన్నారు. వీరిలో మొదటి ఆరుగురూ ఒకే కుటుంబానికి చెందినవారు. ప్రమాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి మిగతా 2లో

జాతీయ స్థాయి

స్విమ్మింగ్ పోటీలకు సాకేత్

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

సాకేత్

విజయనగరంలోని కంటోన్మెంట్ మున్సిపల్ హైస్కూలులో పదో తరగతి చదువుతున్న జి.సాకేత్ జాతీయ స్థాయి అండర్-17 స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరుపున ఎంపికయ్యాడు. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి స్విమింగ్ పోటీలలో విజయనగరం జిల్లా జట్టు తరుపున కంటోన్మెంట్ పాఠశాల విద్యార్థులు జి.సాంకేత్, బి.తేజమణిరాయ్ పాల్గొన్నారు. ఈ పోటీలలో 1/17 విభాగంలో సాకేత్ 50 మీటర్ల బట్టర్‌లోనూ, వంద మీటర్ల బట్టర్‌లోనూ బంగారు పతకాలు సాధించాడు.

50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో వెండి పతకం కైవసం చేరుకున్నాడు. డిసెంబరులో న్యూఢిల్లో జరగనున్న జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు మూడు కేటగిరీలలో ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా సాకేత్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.కాంచన, పిజికల్ డైరెక్టర్ శేఖర్, పిఇటి ప్రమీల, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ఆర్థిక నేరస్థులకు

సంకెళ్లు వేయొద్దు

- పార్లమెంటరీ కమిటీ సిఫార్సు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆర్థిక నేరాలకు పాల్పడి కస్టడీకి తీసుకున్న వారి చేతికి సంకెళ్లు వేయొద్దని పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేసింది. బిజెపి ఎంపి బ్రిజ్‌లాల్ నేతృత్వంలోని హోం వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కొత్త క్రిమినల్ చట్టాలకు మార్పులను సూచించింది. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్‌ఎస్‌ఎస్) ప్రకారం ఒక ఆర్థిక నేరగాడిని అరెస్టు చేసిన మొదటి 15 రోజులకు మించి పోలీసు కస్టడీలో ఉంచినప్పుడు సంబంధించిన మార్పులను సూచించింది. వ్యవస్థీకృత నేరం, ఉగ్రవాద చర్య, మాదకద్రవ్యాలకు సంబంధించిన నేరం లేదా అక్రమంగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని కలిగి ఉండటం, హత్య, అత్యాచారం, యాసిడ్ దాడి, నకిలీ నాణేలు, ఫేక్ కరెన్సీ నోట్లతో పట్టుబడటం, మానవ అక్రమ రవాణా, పిల్లలపై లైంగిక నేరాలు ఇలాంటి వాటికి పాల్పడేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది. ఈ క్లాజ్ వివరణలో మరింత స్పష్టత ఇవ్వడానికి తగిన సవరణ తీసుకురావాలని కమిటీ సిఫార్సు చేసింది. బిఎన్‌ఎస్‌ఎస్ క్లాజ్ 482లో, 'నిందితుడు మొదటి 15 రోజులకు మించి పోలీసు కస్టడీకి అవసరం కావచ్చు' అనే పదాలను కూడా కమిషన్ జోడించింది.

ఢిల్లీలో ప్రమాదకరస్థాయిలో

వాయుకాలుష్యం

- బాణాసంచా కాల్పులతో దిగజారిన వైనం

న్యూఢిల్లీ : ఇప్పటికే కాలుష్య కోరల్లో ఉన్న ఢిల్లీ దీపావళి బాణాసంచా కాల్పులతో మరింత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. దీపావళి సందర్భంగా ప్రజలు బాణాసంచా పేల్చడంతో కాలుష్యం, పొగ కమ్మేశాయి. ఢిల్లీతోపాటు రాజధాని ప్రాంతాల్లో (ఎన్‌సిఆర్) సోమవారం ఉదయం పెరిగిన కాలుష్యం ఆందోళన కలిగిస్తోంది. ఉదయం 6.00 గంటల సమయంలో ఢిల్లీ వాయు నాణ్యతా ప్రమాణం (ఎక్యూఐ) 500 కంటే అధికంగా ఉంది. కొన్ని ప్రదేశాల్లో 900 కి చేరుకుంది. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఎక్యూఐ 910, కరోల్‌బాగ్‌లో 779గా నమోదయ్యాయి. గతవారం కురిసిన వర్షాలు కాలుష్యం నుండి కొంతమేర ఉపశమనం కలిగించినప్పటికీ.. బాణాసంచాతో గాలి నాణ్యత మళ్లీ క్షీణించింది. ఊపిరితిత్తులను ప్రమాదానికి గురిచేసే అతి సూక్ష్మ ధూళికణాలుగా పేర్కొనే పిఎం 2.5 కణాల సాంద్రత 24 గంటల్లోనే 140 శాతం పెరిగింది.

ఆదివారం ఉదయానికి క్యూబిక్ మీటరుకు 83.5గా ఉండగా, ఈ ఉదయానికి అది 200.8కి చేరింది. ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో వాయు కాలుష్యం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) నిర్దేశించిన పరిమితి కంటే 30 రెట్లు ఎక్కువ అని ఢిల్లీ కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది.

అత్యంత కాలుష్య నగరాల్లో మరో రెండు నగరాలు

ప్రపంచంలోనే 10 అత్యంత కాలుష్య నగరాల జాబితాను స్విస్ గ్రూప్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ తాజాగా విడుదల చేసింది. ఆ జాబితా ప్రకారం.. ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాల్లో దేశరాజధాని ఢిల్లీ అగ్రస్థానంలో ఉండగా, దీపావళి కారణంగా పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతా, మహారాష్ట్ర రాజధాని ముంబై నగరాలు కూడా తీవ్ర వాయుకాలుష్యంలో చిక్కుకున్నాయి.

ఎక్యూఐ సూచిక 400 నుంచి 500 మధ్య నమోదైతే వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో ఉన్నట్టు. ఈ స్థాయిలో ఉండే వాయు కాలుష్యం ఆరోగ్యవంతమైన వ్యక్తులపై కూడా ప్రభావం చూపుతుంది. ఎయిర్ క్వాలిటీ సూచిక 150 నుంచి 200 మధ్య నమోదైతే అస్తమా, ఊపిరితిత్తులు, గుండె సమస్యలతో బాధపడుతున్న వారు అస్వస్థతకు గురయ్యే అవకాశాలు ఎక్కువ.

స్వతంత్ర పునాది పెంచుకుంటాం

- బిజెపి విషకౌగిలి నుండి వైసిపి, టిడిపి, జనసేన బయటపడాలి
- ప్రజా ప్రణాళికను ప్రజలకు వివరిస్తాం
- రేపటి రక్షణ భేరి సభను జయప్రదం చేయండి
- విలేకరుల సమావేశంలో వి. శ్రీనివాసరావు

ప్రజా రక్షణభేరి బహిరంగ సభ క్లాత్ బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న వి శ్రీనివాసరావు, సిహెచ్ బాబూరావు, వై వెంకటేశ్వరరావు, వి వెంకటేశ్వర్లు, డివి కృష్ణ, కాశీనాథ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను విస్మరించిన నేపథ్యంలో తాము ప్రజా ప్రణాళికను రూపొందించామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివారావు తెలిపారు. విజయవాడలోని ఎంబివికెలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు డి.వి.కృష్ణ, దోనేపూడి కాశీనాథ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుధవారం విజయవాడలో జరగనున్న ప్రజా పరిరక్షణ బహిరంగ సభ క్లాత్ బ్యానర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ సభలో మిగతా 2లో

10 గంటలకు ప్రదర్శన

ప్రజారక్షణ భేరిలో ప్రదర్శనలో భాగంగా 15వ తేదీ ఉదయం 10 గంటలకు బిఆర్‌టిఎస్ రోడ్డు ఫుడ్ జంక్షన్ నుండి ప్రదర్శన ప్రారంభమవుతుందని, 11 గంటలకు మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో సభ జరుగుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తెలిపారు. సభ విజయవంతం కోసం అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. నగరంలో అన్నికూడళ్లలో తోరణాలు ఏర్పాటు చేశామని, 15వ తేదీన వచ్చేవారికోసం మంచినీరు, వాహనాల పార్కింగు స్థలాన్ని సిద్ధం చేశామని తెలిపారు. ప్రజా కళాకారులు అన్ని ప్రాంతాల్లోనూ ప్రచారం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే బహిరంగ సభలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, ఎస్.పుణ్యవతి, సీనియర్ నాయకులు పి.మధు ప్రసంగిస్తారని తెలిపారు. వీరితోపాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి, సిహెచ్.బాబూరావు, కె.ప్రభాకరరెడ్డి, వి.వెంకటేశ్వర్లు, కె.లోకనాథం, కిల్లో సురేంద్ర ప్రసంగిస్తారని తెలిపారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన మతోన్మాద బిజెపిని, దాని మద్దతు దారులను ఓడించాలని, సిపిఎంను బలపర్చాలని, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత వర్ధిల్లాలనేది ప్రధాన డిమాండ్లని తెలిపారు.

వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన

బ్రిటన్ హోం మంత్రికి ఉద్వాసన

- విదేశాంగ శాఖ మంత్రిగా మాజీ ప్రధాని కెమరాన్
- సునాక్ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ



సుయెల్లా బ్రేవర్‌మాన్



డేవిడ్ కెమరాన్

లండన్: అన్ని వైపుల నుంచి వస్తున్న ఒత్తిళ్లు పెరుగుతుండడంతో బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ తన కేబినెట్ సహచరిణి, హోం మంత్రి సుయెల్లా బ్రేవర్‌మన్‌కు ఎట్టకేలకు ఉద్వాసన పలికారు. పాలస్తీనాకు సంఘీభావంగా లండన్‌లో నిర్వహించిన భారీ ర్యాలీని నిర్దాక్షిణ్యంగా అణచివేయకుండా పోలీసు అధికారులు పక్షపాతంతో వ్యవహరించారంటూ నోరుపారేసుకున్న ఆమెను మంత్రివర్గం నుంచి తొలగించాలని ప్రతిపక్ష పార్టీలతో సహా అన్ని వైపుల నుంచి ఒత్తిడి పెరిగింది. మొదట్లో ఆమెను వెనకేసుకొచ్చిన ప్రధాన మంత్రి చివరికి సొంత పార్టీ నుంచి కూడా విమర్శలు రావడంతో ఉద్వాసన పలకక తప్పలేదు. బ్రేవర్‌మాన్ స్థానంలో ఇప్పటివరకు విదేశాంగ మంత్రిగా వున్న జేమ్స్ క్లెవర్లీని నియమించారు. పార్లమెంటులో ప్రస్తుతం ఏ సభకు ప్రాతినిధ్యం వహించని మాజీ ప్రధాని డేవిడ్ కెమరాన్‌ను సునాక్ తన మంత్రివర్గంలోకి తీసుకోవడం చర్చనీయాంశమైంది. కెమరాన్‌కు కీలకమైన విదేశాంగ శాఖను అప్పగించారు. ఇప్పటికే ప్రజాదరణ అడుగంటిన అధికార కన్సర్వేటివ్ పార్టీని వచ్చే ఎన్నికలకు సిద్ధం చేసే చర్యల్లో భాగంగానే ఈ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరన చేపట్టారని విశ్లేషకులు వ్యాఖ్యానించారు. సుయెల్లా బ్రేవర్‌మాన్ మంత్రి పదవి కోల్పోవడం ఇది రెండోసారి. గతేడాది లిజ్ ట్రస్ ప్రధానిగా వున్నప్పుడు కూడా ఆమె హోం మంత్రిగానే పనిచేశారు. ఆ సమయంలో సుయెల్లా వ్యక్తిగత ఈ మెయిల్ నుండి అధికారిక పత్రాలను పంపినట్లు తేలడంతో కోడ్ ఉల్లంఘన కింద ఆమె పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే లిజ్ ట్రస్ తప్పుకోవడంతో రిషి సునాక్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక, భారతీయ సంతతికి చెందిన బ్రేవర్‌మన్‌ను తిరిగి హోం మంత్రిగా నియమించారు.

రక్తమోడిన రహదారులు

వేర్వేరు ప్రమాదాల్లో తొమ్మిది మంది మృతి

ప్రజాశక్తి - యంత్రాంగం

జాతీయ రహదారులు రక్తమోడుతున్నాయి. ఆదివారం, సోమవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో తొమ్మిది మంది మరణించారు. మృతుల కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు...

మొబైల్ ఫోన్ కొనుగోలు చేసేందుకు కాకినాడ జిల్లా తాళ్ళరేవుకు చెందిన నలుగురు యువకులు ఒకే ద్విచక్రవాహనంలో యానాంకు వెళ్లారు. ఫోన్ కొనుగోలు చేసిన అనంతరం తిరిగి తాళ్ళరేవుకు బయలుదేరారు. లచ్చిపాలెం వద్దకు రాగానే వీరి ముందు వెళ్తున్న ఇటుక లోడు ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొట్టారు. తాళ్లరేవు రచ్చవారిపేటకు చెందిన ఓలేటి శ్రీను (26), వైదాడి రాజు (24), ఐ.పోలవరం మండలం ఎదుర్లంక జగనన్న కాలనీకి చెందిన పాలెపు ప్రసాద్ (24) అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన రచ్చ శ్రీను తాళ్లరేవులోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. వీరందరూ పెయింటింగ్ కార్మికులు.

ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలానికి చెందిన యోహాన్ (31) ఆయన బావమరిది మహేష్ (29) ఏడాది క్రితం తమ కుటుంబాలతో కలిసి వైఎస్ఆర్ జిల్లా కమలాపురం మండలం నల్లింగాయపల్లికి వచ్చారు. వీరిద్దరూ తాపీ మేస్త్రీలుగా పనిచేస్తూ జీవనం సాగించేవారు. పందిళ్లపల్లెలో ఆదివారం రాత్రి పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు.

బండిలో పెట్రోలు తక్కువగా ఉండడంతో పెట్రోల్ కొట్టుంచుకునేందుకు రోడ్డు దాడుతుండగా ఎర్రగుంట్ల వైపు నుంచి కడపకు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. వీరిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. యోహాన్‌కు భార్య విశ్వేశ్వరమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మహేష్‌కు భార్య బుజ్జమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు.

బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండల కేంద్రానికి చెందిన అభి (21), కిషోర్ (19), ప్రేమ్‌కుమార్ ముగ్గురు స్నేహితులు. అభి హైదరాబాద్‌లో ప్రయివేటు ఉద్యోగం చేస్తుండగా కిషోర్ గుంటూరు మిర్చియార్డులో ముఠా కార్మికునిగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో తెనాలిలో బంధువుల ఇంటి వద్ద ఉన్న ప్రేమ్‌కుమార్‌ను కలిసేందుకు అభి, కిషోర్ ఆదివారం రాత్రి తెనాలి వచ్చారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో ముగ్గురూ కలిసి తెనాలి నుంచి భట్టిప్రోలు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. పట్టణంలోని చెంచుపేట వైపు నుంచి ఫ్లైఓవర్ ఎక్కిన తర్వాత బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో అభి, కిషోర్ అక్కడికక్కడే మృతి చెందారు.

బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం, కూచినపూడికి చెందిన దున్న రాజేశ్వరరావు (28) ఆదివారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై నందివెలుగుకు వ్యక్తిగత పని నిమిత్తం వెళ్లారు. తిరిగి వస్తుండగా మరో ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. రాజేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరు గాయపడ్డారు.

సిమెంట్‌లో కలిపే పౌడరు లోడును నెల్లూరు నుంచి తెలంగాణలోని మట్టపల్లి సమీపంలో ఉన్న ఫ్యాక్టరీకి తీసుకెళ్తుండగా అద్దంకి - నార్కెట్‌పల్లి రహదారిలో పెదనెమలిపురి వద్దకు రాగానే లారీ టైరు పేలిపోయింది. దీంతో వాహనం అదుపుతప్పి పల్టీకొట్టింది. ఝార్ఖండ్‌కు చెందిన డ్రైవర్ మహమ్మద్ సిద్ధిక్ (27) అక్కడికక్కడే మృతి చెందారు.

బిల్లులు చెల్లించకుంటే

27 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపేస్తాం

- ఎపి స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆరోగ్యశ్రీ సేవల కింద ఆస్పత్రులకు చెల్లించాల్సిన బిల్లులను విడుదల చేయకుంటే ఈ నెల 27 నుంచి ఆరోగ్యశ్రీ కింద సేవలను నిలిపేస్తామని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ పేర్కొంది. వెంటనే బిల్లులు చెల్లించాలని వైద్యారోగ్య ముఖ్య కార్యదర్శికి అసోసియేషన్ అధ్యక్షులు మురళీకృష్ణ సోమవారం లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.వెయ్యి కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు.

బాలల ప్రత్యేక సంచిక అదనపు కాపీల కోసం.. ప్రజాశక్తి (స్నేహ) బాలల ప్రత్యేక సంచిక

"చిరుమువ్వలు" అదనపు కాపీలు కావాల్సిన వారు కింది చిరునామాలో సంప్రదించగలరు.

సతీష్, సర్క్యులేషన్ ఇన్‌ఛార్జి
ఫోన్ : 94900 99422

గమనిక :

- పుస్తకాల పార్సిల్స్ ఆర్‌టిసి కార్గో ద్వారా బుక్ చేస్తారు.
- డబ్బులు ముందుగానే పంపాలి.
- ఒక్కో కాపీ ఐదు రూపాయల చొప్పున ఎన్ని కాపీలు కావాలో స్పష్టంగా పేర్కొనాలి.

చివరి తేదీ : 14వ తేదీ సాయంత్రం లోపు డబ్బులు పంపిన వారికే ప్రాధాన్యం.

అకౌంట్ వివరాలు :
Account Name: Prajasakti Printers & Publishers PvtLtd
Account No. 35716473975
IFSC Code: SBIN0001008
Branch: Governorpet

- జనరల్ మేనేజర్ (సర్క్యులేషన్)

12 అంశాలతో మినీ మ్యానిఫెస్టో

- టిడిపి, జనసేన కమిటీలో నిర్ణయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వివిధ సమస్యలపై 12 అంశాలతో మినీ మ్యానిఫెస్టోను రూపొందించాలని టిడిపి, జనసేన నిర్ణయించాయి. టిడిపి కార్యాలయంలో సోమవారం టిడిపి, జనసేన మ్యానిఫెస్టో కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ ఆమోదించిన మినీ మ్యానిఫెస్టోను అనుమతి కోసం పైకమిటీకి పంపుతామన్నారు. ఆర్థిక వ్యవస్థ బాగుపడాలని, రైతులకు మేలు జరగాలని, అన్ని రంగాల్లో ప్రజలు మహాశక్తి వంతులు కావాలని తాము భావిస్తున్నామన్నారు. మహాశక్తి పథకం ద్వారా 'తల్లికి వందనం' పేరుతో ఇంటిలో ఎంతమంది చదువుతుంటే అంతమందికి ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.15 వేలు, 'ఆడబిడ్డ నిధి' నుంచి 18 ఏళ్లు నిండిన ప్రతి స్త్రీకీ నెలకు రూ.1500, 'దీపం' పేరుతో ప్రతి ఇంటికీ ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, యువగళం పేరుతో 20 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగులకు యువగళం నిధి నుంచి రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వడం, సౌభాగ్య పథకం ద్వారా చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు 'అంకుర' సంస్థలకు ప్రాజెక్టు వ్యయంలో 20 శాతం గరిష్టంగా రూ.10 లక్షల వరకూ సబ్సిడీ ఇచ్చే విషయాన్ని జనసేన ప్రతిపాదించగా

ఆమోదించామని యనమల తెలిపారు. వీటితో పాటు అన్నదాత పథకం ద్వారా ప్రతి రైతుకూ, కౌలు రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం చేయడంతో పాటు ఆక్వా రైతులకు ప్రోత్సాహం, పాడిరైతులకు నేరుగా ప్రోత్సాహకాలు కల్పించడం, 'ఇంటింటికీ మంచినీరు' పథకం కింద ప్రతి ఇంటికీ రక్షిత తాగునీటి కుళాయి కనెక్షన్, బిసిలకు రక్షణ చట్టం, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పన్నులు, ధరల భారం, విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తూ మౌలిక వసతులను అభివృద్ధి పరచడం, పూర్ టు రిచ్ పథకం ద్వారా పేదలను సంపన్నులు చేసే పి4(పబ్లిక్, ప్రైవేటు పీపుల్ పార్టనర్ షిప్) ఐదేళ్లలో కనీసం రెట్టింపు ఆదాయం, అమరావతే రాజధానిగా ప్రకటిస్తూ అమరావతి నిర్మాణాన్ని కొనసాగిస్తూ అన్ని ప్రాంతాల అభివృద్ధి లాంటి నిర్ణయాలను మ్యానిఫెస్టోలో పెట్టామని యనమల వివరించారు.

జనసేన మేనిఫెస్టో కమిటీ నాయకులు ముత్తా శశిధర్ మాట్లాడుతూ మంచి వాతావరణంలో టిడిపి, జనసేన మ్యానిఫెస్టో కమిటీ సమావేశం జరిగిందన్నారు. మహానాడులో టిడిపి ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలతో పాటు నాలుగు సంవత్సరాలుగా జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్‌కు ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు కొన్ని అంశాలు చేర్చామని తెలిపారు. 'సంపన్న ఆంధ్రప్రదేశ్-అమరావతే రాజధాని' ఉచిత ఇసుక ద్వారా పేదలకు ఇళ్లు నిర్మించడంతో పాటు భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించడం, జనసేన సౌభాగ్య పథకం ద్వారా నిరుద్యోగ యువతను పారిశ్రామికవేత్తలుగా తయారు చేసి ఎక్కడికక్కడ ఉద్యోగాలు కల్పించడం ప్రధాన అంశాలుగా పేర్కొన్నామని తెలిపారు. వ్యవసాయాన్ని భాగ్యపదంగా తీసుకెళ్లడం ద్వారా రైతులు, కౌలు రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం, 'మన ఆంధ్రప్రదేశ్- మనఉద్యోగాలు' అనే ఆరు ప్రతిపాదనలను ఉమ్మడి మ్యానిఫెస్టో కమిటీలో ప్రతిపాదించామని తెలిపారు. టిడిపితో సమన్వయం చేసుకునేందుకు నియోజకవర్గ స్థాయిలో సమావేశాల నిర్వహణ, సంప్రదింపులకు బాధ్యుల నియామకం చేపట్టినట్లు ఆయన వివరించారు. ఈ సమావేశంలో టిడిపి నుంచి పరుచూరి అశోక్‌బాబు, కొమ్మారెడ్డి పట్టాభిరామ్, జనసేన నుంచి డి.వరప్రసాద్, ప్రొఫెసరు కె.శరత్‌కుమార్ పాల్గొన్నారు.

అస్మదీయులకే భూమి!

- లబ్ధిదారుల ఎంపికలో కొరవడిన పారదర్శకత
- భూ పంపిణీ వాయిదా ?

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భూమిలేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన వ్యవసాయ భూముల పంపిణీపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అస్మదీయులకే భూములను కట్టబెట్టనున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ప్రకటించిన కార్యక్రమం ప్రకారం రేపు (బుధవారం) రాష్ట్ర వ్యాప్తంగా భూ పంపిణీ కార్యక్రమం జరగాల్సిఉంది. దీనికి సంబంధించి జిల్లాల్లో అసైన్‌మెంట్ కమిటీ సమావేశాలు జరిగిన దాఖలాలు లేవు. దరఖాస్తులు కోరుతూ బహిరంగ ప్రకటన కూడా విడుదల చేయలేదని అంటున్నారు. అయినా, లబ్ధిదారుల జాబితా సిద్ధం కావడం, రాష్ట్ర వ్యాప్తంగా 62 వేల మందికి దాదాపుగా 52 వేల ఎకరాలు పంపణీ చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం కావడం పట్ల విస్మయం వ్యక్తమవుతోంది. దీంతో ఈ కసరత్తు జరిగిన తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు బుధవారం ఈ కార్యక్రమం జరగాల్సిఉండగా. సోమవారం రాత్రి పది గంటల వరకు కూడా దీనికి సంబంధంచిన షెడ్యూల్ విడుదల కాలేదు. దీంతో ఈ కార్యక్రమం వాయిదా పడిఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అసైన్‌మెంట్ కమిటీలు ఉన్నట్లా? లేనట్లా?

పేదలకు భూములు పంపిణీ చేయాలంటే తొలుత నియోజకవర్గ స్థాయిలో స్థానిక ఎమ్మెల్యే అధ్యక్షతన నియోజకవర్గ కేంద్రాల్లో అసైన్‌మెంట్ కమిటీలు నిర్వహించేవారు. ఆ సమావేశంలో లబ్ధిదారులను ఎంపిక చేసేవారు.

ఇటీవల కాలంలో ఎక్కడా నియోజకవర్గస్థాయిలో అసైన్‌మెంట్ కమిటీలు నిర్వహించిన దాఖలాల్లేవు. ఇటీవల కాలంలో నియోజకవర్గ స్థాయి అసైన్‌మెంట్ కమిటీలు ఉన్నాయో లేవో అర్థం కాని పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది. 2018 మే 15న ప్రభుత్వ భూములు, మిగులు భూములు కేటాయింపు, భూ సంస్కరణలు (వ్యవసాయ హోల్డింగ్‌పై సీలింగ్ చట్టం) 1973 కింద జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన జిల్లా స్థాయి అసైన్‌మెంట్ రివ్యూ కమిటీల పునర్వ్యవస్థీకరణ చేస్తూ జీఓ ఎంఎస్ నెంబరు 250ని ప్రభుత్వం విడుదల చేసింది. జీఓలో పేర్కొన్న ప్రకారం జిల్లా ఇన్‌చార్జీ మంత్రి ఛైర్మన్‌గా, సంబంధిత జిల్లా మంత్రులు సభ్యులుగా, జాయింట్ కలెక్టర్ మెంబర్ కన్వీనరుగా, ప్రత్యేక ఆహ్వానితులుగా సంబంధిత నియోజకవర్గాన్ని ఎంచుకున్న ఎమ్మెల్సీలు, స్థానిక శాసనసభ్యులు వ్యవహరిస్తారు. సభ్యులుగా ఆర్‌డిఓగా ఉంటారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 25లక్షల ఎకరాల వరకు ప్రభుత్వ భూములున్నట్లు కోనేరు రంగారావు కమిటీ పేర్కొంది. నిరుపేదలకు భూములు పంపిణీ చేయాలంటే నిజమైన లబ్ధిదారులను గ్రామ పంచాయతీల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి లబ్ధిదారులను ఎంపిక చేసి, మండల స్థాయికి పంపాల్సి ఉంటుంది. అనంతరం నియోజకవర్గ స్థాయి అసైన్‌మెంట్ కమిటీ అప్రూవల్ కోసం పంపాలి. కానీ, తాజా కార్యక్రమంలో అలా జరగడం లేదు.

లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత ఏది?

లబ్ధిదారులను ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారనే విషయం మిలియన్ డాలర్ల ప్రశ్నగానే మిగిలిపోయింది. పారదర్శకంగా ఎంపిక చేయాల్సిన జాబితా గుట్టు చప్పుడు కాకుండా స్థానిక ఎమ్మెల్యే సూచించిన పేర్లు, స్పందనలో వచ్చిన అర్జీల్లో కొన్ని ఎంపిక (సెలెక్టెడ్) చేసుకుని జాబితా అప్రూవల్ చేసుకున్నట్లు తెలిసింది.

42 మంది జాలర్లను విడుదల చేసిన శ్రీలంక

చెన్నై : తమిళనాడుకు చెందిన 42 మంది జాలర్లను శ్రీలంక విడుదల చేసింది. వీరంతా నాలుగు రోజుల్లో స్వదేశానికి చేరుకుంటారని మత్స్యకారుల సంఘం నాయకులు పి జేసు రాజా సోమవారం వెల్లడించారు. అక్టోబరులో మూడు వేర్వేరు సంఘటనల్లో 64 మంది తమిళ జాలర్లను శ్రీలంక నేవీ అరెస్టు చేసింది. 10 బోట్లను కూడా స్వాధీనం చేసుకుంది.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నాయకులు

దళిత ద్రోహి మోడీ

- మందకృష్ణ ఆలింగనంపై నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

దళితులకు అన్యాయం చేసిన మోడీని మందకృష్ణ మాదిగ కౌగిలించుకోవడాన్ని ఖండిస్తూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో విశాఖ ఎల్ఐసి భవనం సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు మాట్లాడుతూ.. దేశంలో ఏ మూల చూసినా నేడు దళితులు, మైనార్టీలు, మహిళలపైనా దాడులు అధికమయ్యాయన్నారు. ఇందుకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ విధానాలే కారణమని తెలిపారు. అంతే కాకుండా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు వ్యక్తులకు మోడీ సర్కారు ధారాదత్తం చేస్తోందన్నారు. దీనివల్ల దళితులు రిజర్వేషన్లు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా అన్నింటా దళితులకు అన్యాయం చేసిన మోడీని మందకృష్ణ మాదిగ కౌగిలించుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జగదాంబ జోన్ కార్యదర్శి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

15న వరికపూడిశెలకు సిఎం శంకుస్థాపన

- రూ.340 కోట్లతో ఫస్ట్ ఫేజ్ పనులు : మంత్రి అంబటి

ప్రజాశక్తి - మాచర్ల (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా మాచర్ల నియోజవర్గం వెల్దుర్తి మండలంలోని వరికపూడిశెల లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి ఈ నెల 15వ తేదీన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. సోమవారం నర్సరావుపేట ఎంపి శ్రీ కృష్ణదేవారాయులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిలతో కలిసి ఆయన హెలిపాడ్, సభాస్థలిని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ ఫస్ట్ ఫేజ్ కింద రూ.340 కోట్ల వ్యయంతో సిఎం ఈ పనులు ప్రారంభించనున్నారని తెలిపారు. వరికపూడిశెల ప్రాజెక్టుతో ఎగువ ప్రాంత గ్రామాలకు సాగు, తాగునీరు అందుతుందన్నారు. అనేక కారణాల వల్ల ఈ పథకానికి పలుమార్లు శంకుస్థాపన జరిగిందని, గత ప్రభుత్వాలు ఎలాంటి అనుమతులూ పొందలేకపోవడంతో పనులు జరగలేదన్నారు. కానీ ఇప్పుడు ప్రాజెక్టుకు అవసరమైన అటవీశాఖ అనుమతులను పొందామని తెలిపారు. తొలి దశలో రూ340 కోట్లతో 25 వేల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు పూర్తి చేయాలని, రెండవ దశలో లక్ష ఎకరాలకు రూ 3,400 కోట్లతో పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు.

స్టీల్‌ప్లాంట్ ప్రగతిని దిగజారిస్తే ఊరుకోం

- ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

కేంద్రంలోని మోడీ సర్కారు ఆదేశాలతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కర్మాగారం ప్రగతిని దిగజార్చేలా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునేదిలేదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1005వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ సిఐసిసిపి విభాగానికి చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి ఆదినారాయణ, మొహిద్దీన్, వరసాల శ్రీనివాసరావు మాట్లాడారు. ప్లాంట్ పరిస్థితి ఇంతలా దిగజారడానికి యాజమాన్యం చర్యలే కారణమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్లాంటు ప్రగతిని దిగజారుస్తూ దొడ్డిదారిన ప్రయివేటు యాజమాన్యాలను తీసుకురావాలని చూడడం దుర్మార్గమన్నారు. ఇంటి దొంగల పని పట్టి ప్లాంటును పరిరక్షించుకోవడం ప్రతి ఉద్యోగి బాధ్యతని తెలిపారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం యాజమాన్యానికి కొమ్ముకాసే అధికారులను కార్మికులు క్షమించరని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు తాండ్ర కనకరాజు, కామేష్, దేముడు, నాయుడు, పరమేష్ రమణ, సుబ్బారావు పాల్గొన్నారు.

సిపిఎం సీనియర్ నేత వాసుదేవ్ ఆచార్య కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

అంత్యక్రియలు బెంగాల్‌లోని స్వగ్రామంలో జరుగుతాయని పార్టీ బెంగాల్ రాష్ట్ర కమిటీ తెలిపింది.

పశ్చిమ బెంగాల్‌లోని బంకురా నుంచి1984 నుంచి 2009 వరకు వరుసగా 9 సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు.14 ఏళ్ల పాటు పార్టీ లోక్‌సభ నాయకుడిగా పనిచేశారు. పబ్లిక్ అండర్‌టేకింగ్ అస్యూరెన్స్ కమిటీ, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా చాలా ఏళ్లపాటు పనిచేశారు. లోక్‌సభలో ప్రజల సమస్యలను లేవనెత్తడంలో ముందుండే ఆచార్య ప్రముఖ కమ్యూనిస్టు పార్లమెంటేరియన్‌లలో ఒకరిగా గుర్తింపు పొందారు.. . విద్యార్థి జీవితం నుండే రాజకీయాల్లోకి వచ్చిన ఆచార్య స్కూలు టీచర్ ఉద్యోగాన్ని వదిలిపెట్టి పూర్తిస్థాయి పార్టీ కార్యకర్తగా 1967లో చేరారు. అంచెలంచెలుగా ఎదుగుతూ 1985లో పార్టీ బెంగాల్ రాష్ట్ర కమిటీ సభ్యుడయ్యారు.

1998లో కోల్‌కతాలో జరిగిన పార్టీ 16వ ఆలిండియా మహాసభలో కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారు. 2018లో కేంద్ర కంట్రోల్ కమిషన్‌కు చైర్మన్‌గా ఎన్నికయ్యారు.. సిఐటియు ఉపాధ్యక్షుడిగా దశాబ్దాల పాటు సేవలందించారు. రైల్వే, బొగ్గు కార్మికుల నేతగా ఆయన విశేష కృషి చేశారు. నెల రోజుల క్రితం కూడా లోకో రన్నింగ్ స్టాఫ్ ధర్నా, పురూలియా, ఆద్రాల్లో ఎఫ్‌సిఐ గోడౌన్ కార్మికుల ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. మొదట్లో ఉపాధ్యాయ సంఘానికి కూడా నాయకత్వం వహించారు.

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన యోధుడు : పొలిట్‌బ్యూరో

వాసుదేవ్ ఆచార్య మృతికి పార్టీ పొలిట్‌బ్యూరో తీవ్ర సంతాపం తెలియజేసింది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేసింది. విశిష్ట పార్లమెంటేరియన్‌గా ఆయన ఎల్లప్పుడూ ప్రజా సమస్యలనే ప్రస్తావించేవారని పేర్కొంది. 1980 నుంచి 2009 వరకు లోక్‌సభకు

హైదరాబాద్‌లో వాసుదేవ్ ఆచార్య భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తొమ్మిది సార్లు ఎన్నికయ్యారని తెలిపింది. కార్మికోద్యమంలో చురుకుగా పాల్గొన్న వాసుదేవ్ ఆచార్య ప్రధానంగా రైల్వే, బొగ్గు కార్మికుల నేతగా వున్నారు. కార్మిక వర్గ సిద్ధాంతాల పట్ల ధృఢమైన విశ్వాసాన్ని కలిగివుంటూ దోపిడీ వ్యవస్థ మార్పు కోసం జరిగే పోరాటంలో నిర్ణయాత్మక పాత్ర పోషించారని పేర్కొంది. దశాబ్దాల పాటు సిఐటియు ఉపాధ్యక్షుల్లో ఒకరిగా కూడా వున్నారు. ఆరేళ్ల నుండి సిఐటియు జాతీయ కార్యదర్శివర్గ శాశ్వత ఆహ్వానితుడుగా కూడా వున్నారు. వివిధ రుగ్మతలతో ఆయన ఆరోగ్యం సహకరించకపోయినప్పటికీ జాతీయ స్థాయిలో, రంగాలవారీగా కార్మికులు జరిపే అన్ని కీలక పోరాటాల్లోనూ ఆయన పాల్గొనేవారని పేర్కొంది.

కార్మికోద్యమం పెద్ద దిక్కును కోల్పోయింది: సిఐటియు

ప్రజలు ముఖ్యంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంతంగా పోరాడిన వాసుదేవ్ ఆచార్య సంఘటిత, అసంఘటిత రంగాల్లోని కార్మికుల సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని సిఐటియు పేర్కొంది. సంతాప సూచకంగా సిఐటియు పతాకాన్ని అవనతం చేసింది. ఈ మేరకు సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కె హేమలత, తపన్‌సేన్ ఒక ప్రకటన విడుదల చేశారు. అఖిల భారత బొగ్గు కార్మికుల సమాఖ్య అధ్యక్షుడిగా ఆయన అనేక సమరశీల పోరాటాల్లో పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికై పార్లమెంట్ లోపల, వెలుపలా ఆయన జరిపిన కృషి ఎనలేనిదని సిఐటియు పేర్కొంది. ఏ రాష్ట్రాల వారైనా, ఏ కార్మిక సంఘానికి చెందినవారైనా వాటితో సంబంధం లేకుండా కార్మికులందరికీ ఆయన ఇంటి ద్వారాలు తెరిచే వుండేవి. తమ ఇబ్బందులు, సమస్యల పరిష్కారం కోసం వారు ఆయన్ని కలిసేవారని పేర్కొంది. సమైక్య పోరాటాల ద్వారా కార్మికోద్యమాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలా అనే తపన పడేవారు. ఆయన మృతితో కార్మికోద్యమం పెద్ద దిక్కును కోల్పోయిందని, ఆయన లేని లోటు పూడ్చలేనిదని సిఐటియు పేర్కొంది.

కార్మిక, కర్షక ఐక్యత కోసం శ్రమించిన నేత: ఎఐకెఎస్

కార్మికులు, కర్షకుల సమైక్యత కోసం తీవ్రంగా శ్రమించిన నేత వాసుదేవ్ ఆచార్య అని అఖిల భారత కిసాన్ షభ పేర్కొంది. వృద్ధాప్యం మీద పడుతున్నా వెరవకుండా ప్రజల సమస్యల పరిష్కారానికి పరితపించేవారని కొనియాడింది. ఆయన పనితీరు రాబోయే తరాలకు కూడా స్ఫూర్తిదాయకంగా వుంటుందని పేర్కొంది. ఈ మేరకు ఎఐకెఎస్ నేతలు అశోక్ ధావలె, విజూ కృష్ణన్ ఒక ప్రకటన జారీ చేశారు.

వామపక్ష, వ్యవసాయ కార్మిక ఉద్యమానికి తీరని లోటు : అఖిల భారత వ్యవసాయకార్మిక సంఘం

వాసుదేవ్ ఆచార్య మృతికి అఖిల భారత వ్యవసాయ కార్మికుల సంఘం కేంద్ర వర్కింగ్ కమిటీ సంతాపం తెలియజేసింది. ఆరు దశాబ్దాల పాటు కార్మిక రంగ ఉద్యమంతో ఆయన జీవితం పెనవేసుకుపోయిందని, ఆయన మృతి దేశంలో వామపక్ష, కార్మిక రంగ ఉద్యమానికి తీరని లోటని సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.విజయరాఘవన్, బి.వెంకట్ పేర్కొన్నారు.

రాష్ట్రంలో సిఐటియు, ఇతర సంఘాల సంతాపం

కార్మిక ఉద్యమ నేత ఆచార్య వాసుదేవ్ మృతి పట్ల సిఐటియు రాష్ట్ర కమిటీ సంతాపం ప్రకటించింది. ఈ మేరకు సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు సంతాపం ప్రకటించారు. ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, ఎపి రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి ఉమామహేశ్వరరావు, వివిఎల్ నరసింహులు సంతాపం తెలిపారు. అలుపెరుగని కార్మిక యోధుడని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కమిటీ పేర్కొంది.

స్వతంత్ర పునాది పెంచుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాప్రణాళికను వివరిస్తామని తెలిపారు. దీని ద్వారా ప్రజా పునాదిని పెంచుకుంటామన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయ ఎజెండాను కూడా ఈ సభ ద్వారా ప్రజల్లోకి తీసుకెళతామని తెలిపారు. దీనిలో భాగంగా ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా మూడు జాతాలు నిర్వహించామని, ప్రజలు అనేక సమస్యలు వివరించారని తెలిపారు.

బిజెపి పాలనలో విలపిత భారత్

వికసిత భారత్ పేరుతో కేంద్ర ప్రభుత్వం పథకాల ప్రచారం పేరిట ఐఎఎస్, ఐపిఎస్ అధికారులను ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారకులుగా మారుస్తోందని అన్నారు. ఈ పేరుతో మోడీ ప్రచారం సాగుతుందన్నారు. దేశంలో వికసిత భారత్ లేదని, విలపిత భారత్ ఉందన్నారు. ప్రజలు బాధల్లో ఉంటే విలాసవంతంగా ఉన్నట్లు నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. మోడీ పాలనలో మాటలు తప్ప చేతలు లేవని రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేశారని చెప్పారు. కృష్ణా జలాల విషయంలో తీరని ద్రోహం చేస్తున్నా రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి, ప్రతిపక్ష టిడిపి ప్రశ్నించడం లేదన్నారు. ప్రశ్నించడానికే పుట్టిందన్న జనసేన తెలంగాణాలో బిజెపితో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లోకి వెళ్తోందని, ఇక్కడ తెలుగుదేశంతో పొత్తు నడుపుతోందని వివరించారు. బిజెపి, కాంగ్రెస్‌కు సమాన దూరంలో ఉంటామని చెబుతున్న టిడిపి ప్రజలను మోసం చేస్తోందని అన్నారు. ఈ నాలుగు పార్టీలు ప్రజల ఎజెండాను పక్కనబెట్టి సొంత ఎజెండాను అమలు చేస్తున్నాయన్నారు.

నిజంగా పనులు చేస్తే జగన్ ప్రచారం ఎందుకు

రాష్ట్రంలో వైసిపి 'వైఎపి నీడ్స్ జగన్' పేరుతో ప్రచారం చేస్తోందని, నిజంగా అభివృద్ధి చేసి ఉంటే ప్రజలే నమ్ముతారని, ఇంటింటికీ పోయి ప్రచారం చేసుకోవాల్సిన అవసరం ఏమిటని శ్రీనివాసరావు ప్రశ్నించారు. చేసిన వాగ్దానాలు అమలు చేసి చెబితే ప్రజలు నమ్ముతారని తెలిపారు. 26 జిల్లాల్లో తమ యాత్ర పర్యటించిన సమయంలో ఎవరూ కూడా జగన్ మరలా కావాలని అడగలేదని అన్నారు.

రోడ్లు, తాగునీరు, పనీ ఏమీలేవు

రాష్ట్రంలో రోడ్లు బాగులేవని, తాగేందుకు మంచినీరు లేదని, ఉపాధి హామీ పని కూడా లేదని అన్నారు. అదే సమయంలో నిత్యావసర ధరలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా కరెంటు ఛార్జీలపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, మూడు నెలల్లో బిల్లులు రెట్టింపు అవుతున్నాయని చెప్పారు. దీనికి తోడు స్మార్ట్ మీటర్లు పెడతామని చెబుతున్నారని, ఇది మరింత భారమన్నారు. అల్లూరు, పార్వతీపురం జిల్లాల్లో ఎక్కడా నాడునేడుగానీ, జగనన్న ఇళ్లు గానీ లేవని తెలిపారు. ఆదివాసీలకు ఇచ్చిన పట్టాలకు భూములు కూడా చూపించే దిక్కులేదని, వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారనిచెప్పారు. పాఠశాలలు కూలిపోయేదశలో ఉన్నాయని, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 100 వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అంబులెన్సులో పోయే రోడ్డులేదని, అదానీ కోసం రూ.500 కోట్లతో రోడ్లు వేస్తున్నారని విమర్శించారు. అక్కడ జనం మాత్రం గ్రామాలకు రోడ్లు వేయాలని కోరుతున్నారని అన్నారు. గర్భిణులు జబ్బు చేస్తే ఆస్పత్రికి వెళ్లే దారిలోనే చనిపోతున్నారని అన్నారు. అల్లూరు జిల్లా డుంబ్రిగూడలో వంతెన కడితే మండల కేంద్రానికి 30 కి.మీ దూరం కాస్తా రెండు కి.మీకు తగ్గుతుందని అన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి కేవలం రెండు కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు అవుతాయని తెలిపారు. అయినా ప్రభుత్వం సిద్ధపడటం లేదన్నారు. అదానీకి భూములు ఇచ్చేందుకు కనీసం గ్రామ సభలు కూడా నిర్వహించలేదని గిరిజనులను అమానవీయంగా భూముల నుండి గెంటేస్తున్నారని చెప్పారు. ట్రైబల్ సబ్‌ప్లాను అమలు చేయడం లేదన్నారు.

అభివృద్ధి మాని బూతులు తిట్టుకుంటున్నారు

రాష్ట్రంలో పాలకులు అభివృద్ధి మానేసి బూతులు తిట్టుకుంటున్నారని, వారి బూతులతో డిక్షనరీ తయారు చేయొచ్చని అన్నారు. ప్రజల సంక్షేమం కంటే వ్యక్తిగత తిట్లకు విమర్శలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ఇక్కడ అవినీతిపై ఫిర్యాదు చేశానని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురంధేశ్వరి చెబుతున్నారని, మరి కేంద్ర హోంశాఖ, సిబిఐ ఇప్పటి వరకు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. బిజెపి నాయకులకే కేంద్రం స్పందించకపోతే సామాన్యులకు ఏం చేస్తుందని ప్రశ్నించారు. బిజెపికి వైసిపి, టిడిపి, జనసేన మద్దతు ఇవ్వడం పచ్చి అవకాశవాదమని అన్నారు. ఇప్పటికైనా ఆయా పార్టీలు బిజెపిని వదిలి బయటకు రావాలని కోరారు.

ఐఐఎంలకు నియమాలు

- రాష్ట్రపతికి గవర్నరు బోర్డును రద్దు చేసే అధికారం
- ఐఐఎం డైరెక్టర్ నియామకంలో విజిటర్ దే తుది నిర్ణయం
- కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ నోటిఫై

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో రాష్ట్రపతి ఇప్పుడు 'విజిటర్'గా ఉండాలనే కొత్త నిబంధనను కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. బోర్డ్ ఆఫ్ గవర్నర్ల ఛైర్మన్‌ను నియమించే అధికారాలు, డైరెక్టర్ల నియామకం, తొలగింపు, దాని విధులను నిర్వర్తించడంలో అసమర్థత కారణంగా బోర్డును రద్దు చేయడం, 'విజిటర్' ఇచ్చిన ఏదైనా నిర్దేశాన్ని పాటించడంలో ప్రజా ప్రయోజనాల కోసం నిరంతరం డిఫాల్ట్ చేయడం వంటి అధికారాన్ని కట్టబెట్టింది.

2018 ఐఐఎం నిబంధనలను మరింత సవరించడానికి తీసుకొచ్చిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (సవరణ) రూల్స్-2023 ఈ ఏడాది జులైలో పార్లమెంటులో ఆమోదించ బడింది. నిబంధనలు, షరతులను పేర్కొంటూ నవంబరు 11న గెజిటెడ్ నోటిఫికేషన్‌లో కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ కొత్త నిబంధనలను నోటిఫై చేసింది. ఇప్పుడు ప్రతి ఐఐఎం 'విజిటర్' అయిన రాష్ట్రపతికి, విధాన నిర్ణయాలు తీసుకోవడం, వార్షిక బడ్జెట్లను ఆమోదించడం, ఫీజులను నిర్ణయించడం వంటి నిర్ణయాలు తీసుకునే ప్రతి ఐఐఎం ప్రధాన కార్యనిర్వాహక సంస్థ అయిన బోర్డ్ ఆఫ్ గవర్నర్ల ఛైర్మన్‌ను నామినేట్ చేసే పూర్తి అధికారం ఉంటుంది. కొత్త డైరెక్టర్ల నియామకాల కోసం శోధన ప్యానెల్ (సెర్చ్ కమిటీ)లను నియమించే అధికారం ఉంటుంది.

అంతకముందు, నిర్వాహకులు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, నిర్వహణ నిపుణుల నుండి ఐదుగురు ప్రముఖులతో కూడిన సెర్చ్-కమ్-సెలక్షన్ కమిటీని బోర్డు ఏర్పాటు చేసేది. కొత్త నిబంధనల ప్రకారం, విజిటర్‌కు ఇప్పుడు బోర్డును ఏ సమయంలోనైనా రద్దు చేసే అధికారం ఉంటుంది. బోర్డు విధులను నిర్వర్తించడం సాధ్యం కాదని విజిటర్ భావిస్తే, రద్దు చేయవచ్చు. 'విజిటర్ ఉత్తర్వు ద్వారా బోర్డును రద్దు చేసి, ఒక వ్యక్తిని లేదా వ్యక్తులను తాత్కాలిక బోర్డుకు ఛైర్మన్‌గా, సభ్యులుగా నియమించవచ్చు. అటువంటి కాలానికి, ఆరు నెలలకు మించకుండా ఉండాలి' అని నోటిఫికేషన్ పేర్కొంది. ఇంతకముందు, బోర్డు రద్దుకు అటువంటి నిబంధన లేదు. కొత్త నిబంధనల ప్రకారం, ఏదైనా ఐఐఎం డైరెక్టరు నియామకంలో విజిటర్‌దే తుది నిర్ణయం. 'బోర్డు సిఫార్సు చేసిన పేర్లలో ఒకదానిని విజిటర్ నామినేట్ చేయాలి. వ్యక్తిని డైరెక్టరుగా నియమించడం కోసం బోర్డుకు పంపాలి. బోర్డు సిఫార్సు చేసిన పేర్లతో విజిటర్ సంతృప్తి చెందకపోతే, విజిటర్ అడిగితే, బోర్డు తాజా సిఫార్సులు చేస్తుంది' అని పేర్కొంది.

ఇంతకముందు డైరెక్టరు నియామకానికి పూర్తిగా బోర్డు బాధ్యత వహించేది. విజిటర్‌కు ఇప్పుడు డైరెక్టర్ సేవలను రద్దు చేసే అధికారం కూడా ఉంటుంది. 'ఈ విజిటర్ డైరెక్టర్ సేవలను రద్దు చేయవచ్చని లేదా డైరెక్టర్‌ను ఇన్‌స్టిట్యూట్ సేవల నుండి తప్పించవచ్చని నిర్ణయించుకుంటే, బోర్డు నిర్ణయాన్ని అనుసరించడానికి కట్టుబడి ఉంటుంది' అని నోటిఫికేషన్ పేర్కొంది. ఐఐఎం రూల్స్ 2018 ప్రకారం, బోర్డ్ ఆఫ్ గవర్నర్లకు మాత్రమే మూడింట రెండు వంతుల సభ్యులు హాజరై ఓటింగులో ఉండాలి. బోర్డులోని 50 శాతం కంటే ఎక్కువ మంది సభ్యులతో డైరెక్టరును తొలగించే అధికారం ఉంది. కొత్త నిబంధనలు ఐఐఎం డైరెక్టరుకు పిహెచ్‌డి, బ్యాచలర్, మాస్టర్స్ స్థాయిల్లో ఫస్ట్ క్లాస్ డిగ్రీలు విద్యార్హతలను' నోటిఫికేషన్‌లో పేర్కొంది.

హైదరాబాద్‌లో ఘోరం

(మొదటి పేజీ తరువాయి)

కెసిఆర్, గవర్నర్ తమిళిసై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంటనే ఘటనాస్థలికి వెళ్లాల్సిందిగా మంత్రులు కెటిఆర్, తలసానిలను సిఎం ఆదేశించారు. ప్రమాద ఘటనపై పూర్తి వివరాలతో నివేదిక అందజేయాల్సిందిగా పోలీసులకు గవర్నర్ ఆదేశాలు జారీ చేశారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రులు కెటిఆర్, తలసాని, మేయర్ విజయలక్ష్మి, స్థానిక నాయకులు ఫిరోజ్ ఖాన్, నంద కిషోర్ వ్యాస్, కుమార్ గౌడ్, విహెచ్ తదితరులు సందర్శించారు. బాధితులను పరామర్శించారు. దీపావళి సందర్భంగా కాల్చిన పటాసుల నిప్పు రవ్వలు సెల్లార్‌లో పడి రసాయనాలకు అంటుకుని మంటలు వ్యాపించి ఉంటాయని క్లూస్ టీం ప్రాథమికంగా నిర్ధారించినట్టు పోలీసులు తెలిపారు. నాంపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి : సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ కమిటీ

అగ్నిప్రమాద ఘటన ప్రాంతాన్ని సిపిఎం బృందం సోమవారం సందర్శించింది. ప్రమాదం జరిగిన తీరుపై స్థానికులతో ఆరా తీసింది. హైదరాబాద్ నగరంలో అగ్నిప్రమాదాలు తరచుగా జరుగుతున్నా వాటి నివారణకు ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు తీసుకోవడంలేదని సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ విమర్శించారు. నాంపల్లి ప్రమాద ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ నేతలు నారాయణ, చాడ వెంకటరెడ్డి తదితరులు ప్రమాద ప్రాంతాన్ని సందర్శించారు.

ఘటన బాధాకరం : సిపిఎం ఎపి రాష్ట్ర కమిటీ

హైదరాబాద్‌లో ఘోర అగ్నిప్రమాదంలో తొమ్మిది మంది మృతి చెందడం బాధాకరమని సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపం తెలిపింది. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం ఎపి రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. మృతుల కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మాదిగల ఓట్ల కోసమే మోడీ మొసలి కన్నీరు : కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాదిగల ఓట్ల కోసమే ప్రధానమంత్రి మోడీ మొసలి కన్నీరు కార్చుతున్నారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లప్ప, అండ్ర మాల్యాద్రి విమర్శించారు. మాదిగల ఆత్మగౌరవాన్ని బిజెపికి మంద కృష్ణ తాకట్టు పెడుతున్నారని అన్నారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందునే మోడీ ఇటువంటి ప్రకటనలు చేస్తున్నారని, కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బిజెపి పార్లమెంటులో ఎందుకు బిల్లు పెట్టలేదని ప్రశ్నించారు. మాదిగలను మనువాదం వైపు నడిపించడానికి మందకృష్ణ, మాదిగలను బిజెపి వాడుకోవడానికి ప్రయత్నిస్తోందన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళితులపై 300 రెట్లు దాడులు పెరిగాయన్నారు. ఉపాధి పనికి సంబంధించి దళితుల జాబ్‌కార్డులతోపాటు వారికి కేటాయించిన బడ్జెట్‌ను కేంద్ర బిజెపి ప్రభుత్వం తగ్గించిందన్నారు.

ఎంబిఎ, ఎంసిఎ రెండో విడత కౌన్సిలింగ్‌కు షెడ్యూల్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎపి ఐసెట్ 2023 ర్యాంకర్లకు ఎంబిఎ, ఎంసిఎ అడ్మిషన్ల కోసం రెండోవిడత, తుది విడత అడ్మిషన్ల కౌన్సిలింగ్‌కు షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ కె రామమోహనరావు ఈ మేరకు అడ్మిషన్ల షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేశారు. మంగళవారం నాడు కౌన్సిలింగ్‌కు సంబందించిన నోటిఫికేషన్‌ను విడుదల చేస్తారు. ఈ నెల 15 నుండి 17 దాకా ర్యాంకర్లు వెబ్‌కౌన్సిలింగ్‌లో ఆప్షన్‌ను ఇచ్చుకోవాల్సి వుంటుంది. అలాగే 16వ తేది నుండి 18వ తేదీ దాకా సర్టిఫికేట్ల వెరిఫికేషన్, 17నుండి 19 దాకా వెబ్‌కౌన్సిలింగ్‌లో నమోదైన దరఖాస్తుల పరిశీలన వుంటుంది. ఈ 20వ తేదీన వెబ్ ఆప్షన్స్‌లో మార్పులకు అవకాశం వుంటుంది. ఈ నెల 22న సీట్స్ అలాట్ మెంట్ వుంటుంది. సీట్స్ అలాట్ అయిన అభ్యర్థులు ఈ నెల 23న సంబంధిత కళాశాలలో రిపోర్ట్ చేసుకోవాలని షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం ఉదయం దీపావళి ఆస్థానం జరిగింది. ఆలయ అర్చకులు, తిరుమల జీయంగార్లు, టిటిడి ఉన్నతాధికారుల సమక్షంలో బంగారువాకిలి చెంత ఆగమోక్తంగా ఆస్థాన వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఈ దీపావళి ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. స్వామి, అమ్మవార్లను సాయంకాలం ఆలయ నాలుగు మాఢవీధుల్లో ఊరేగించారు. తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఇఒ ఎవి.ధర్మారెడ్డి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఇరురాష్ట్రాలు కలిసికట్టుగా ఉండాలి : రేవంత్ రెడ్డి

తెలంగాణ పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా ఆదివారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామంలో స్వామి పూజలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. రంగనాయకుల మండపంలో రేవంత్ రెడ్డికి ఆలయ పండితులు స్వామివారి పట్టువస్త్రం, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలని, ఉభయ తెలుగు రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని స్వామిని కోరుకున్నట్లు తెలిపారు. ఇరు రాష్ట్రాల మధ్య ఆర్థిక, రాజకీయ బంధాలు బాగుండాలని ప్రార్థించినట్లు వివరించారు. తెలంగాణకు మంచిరోజులు రాబోతున్నాయని చెప్పారు.

జర్నలిస్టుల ఇళ్లస్థలాల జిఓ నిబంధనలు మార్చాలి

- ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని అదే సమయంలో ఇటీవల వచ్చిన జిఓలో ఉన్న కొన్ని అంశాలు ప్రభుత్వ ఉద్దేశాన్ని నెరవేర్చే విధంగా లేవని వాటిని వెంటనే మార్చాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సోమవారం లేఖ రాశారు. జర్నలిస్టులు 40 శాతం షేర్ ఇవ్వాలన్న నిబంధన సరికాదని, స్థలం కోసమే లక్షల రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తుందని, ప్రభుత్వమే గతంలో ఇచ్చినట్లు ఉచితంగా (నామినల్ రేట్‌కి) ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. నిబంధనల్లో పేర్కొన్న అంశాల్లో జర్నలిస్టు భార్యకు గానీ, జర్నలిస్టుకు గానీ ఇల్లు లేదా ఇంటి స్థలం ఉంటే ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చే ఇంటి స్థలానికి అర్హులు కాదని పేర్కొన్నారని, దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వేలాది మంది జర్నలిస్టులకు న్యాయం జరిగే అవకాశం లేదని తెలిపారు. ఇళ్ల స్థలాల విషయంలో జర్నలిస్టుల అర్హతలకు సంబంధించి సమాచార పౌర సంబంధాల శాఖ నిర్వచనం ప్రకారం అర్హులను ఎంపిక చేసి, వారికి స్థలాలు కేటాయించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఇళ్ల స్థలాల జిఓకు నెంబరు కేటాయించాలని కోరారు.

గిరిజనుల శ్మశానం దున్నేశాడు

- వైసిపి నాయకుడి దుశ్చర్య

ప్రజాశక్తి-శింగరాయకొండ (ప్రకాశం జిల్లా)

గిరిజనుల శ్మశాన భూమిపై కన్నేసిన వైసిపి నాయకుడు వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో అధికారులు లేని సమయం చూసి.. ట్రాక్టర్‌తో దున్నేశాడు. మృతదేహాలు పైకి రావడంతో విషయం తెలుసుకొని గిరిజనులు అక్కడికి రావడంతో వైసిపి నాయకుడు పరారయ్యాడు. ఈ ఘటన ప్రకాశం జిల్లా శంగరాయకొండ మండలం పాత శింగరాయకొండ పంచాయతీ పరిధిలో ఆదివారం జరిగింది. ఈ భూవివాదం కోర్టులో ఉందని అధికారులు చెబుతున్నారు. పంచాయతీ పరిధిలోని బాలిరెడ్డినగర్, మల్లికార్జున నగర్, పోతుల చెంచయ్య కాలనీకి శ్మశానం కోసం సర్వే నెంబర్ 105లో సుమారు నాలుగు ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు కేటాయించారు. ఈ స్థలం తనదని వైసిపి నాయకుడు చాన్‌బాషా గత ఆరు నెలల క్రితం గిరిజనులకు అడ్డం తిరిగి రచ్చ చేశాడు. గిరిజనుల ఫిర్యాదుతో చాన్‌బాషాపై అట్రాసిటీ కేసు కూడా పోలీసులు నమోదు చేశారు.

ఆ భూమి తనదేదంటూ ఆ వైసిపి నాయకుడు కోర్టు మెట్లు ఎక్కాడు. ఈ నేపథ్యంలో రెండో శనివారం, దీపావళి సందర్భంగా వరసగా మూడ్రోజులు సెలవు రావడంతో అధికారులు అందుబాటులో ఉండరని ఏకంగా శ్మశానంలోకి ట్రాక్టర్‌తో వెళ్లి భూమిని దున్ని మినుము విత్తనాలు చల్లాడు. ఆ ప్రాంతంలోని గిరిజనుల మృతదేహాలను అక్కడే పాతిపెట్టేవారు. భూమి దున్నడంతో కొన్ని చోట్ల మృతదేహాలు కూడా పైకి వచ్చాయి. గిరిజనులు అక్కడకు రావడం చూసి ట్రాక్టర్‌తో సహా వైసిపి నాయకుడు పరారయ్యాడు. మృతదేహాలకు సంబంధించిన బంధువులు వచ్చి మళ్లీ మట్టితో పూడ్చిపెట్టారు. గిరిజనులు తహశీల్దార్ సిహెచ్ ఉషాకు సమాచారం అందజేశారు. విఆర్‌ఎ నరసింహ రెవెన్యూ అధికారులు ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అక్కడ జరిగిన విషయాన్ని తెలియజేశారు. జాతీయ రహదారికి పక్కనే ఉన్న ఈ భూమి కోట్ల రూపాయలు విలువ చేయడంతో ఆ భూమిని చేజిక్కించుకునేందుకు ఈ వైసిపి నాయకుడిని వెనక ఉన్న బడా వైసిపి నాయకులు ముందుకు తోలుతున్నారని గిరిజన సంఘ నాయకులు విమర్శించారు. మంగళవారం రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చి.. పోలీస్‌స్టేషన్లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని కాలనీవాసులు తెలిపారు.

శవాన్ని సైతం దున్నివేయడంతో చుట్టూరు మట్టి పోసుకున్న వైనం

స్మశానం వద్ద ఆందోళన చేస్తున్న గిరిజనులు

మూడో రోజూ టూరిజం కార్మికుల సమ్మె

- నేడు చర్చలు

ప్రజాశక్తి - అరకులోయ, అనంతగిరి (అల్లూరి జిల్లా)

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి టూరిజం కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారానికి మూడో రోజుకు చేరుకుంది. అధికారులు తమ సమస్యలను పరిష్కరించే వరకూ సమ్మెను విరమించేదిలేదని వారు స్పష్టం చేశారు. సమ్మెతో అరకులోయలోని మయూరి హరిత రిసార్ట్, హరిత వ్యాలీ రిసార్ట్, అనంతగిరి మండలంలోని బొర్రా గుహలు, టైడా జంగిల్ బెల్స్, అనంతగిరి హరిత హిల్ యూనిట్లు మూతపడ్డాయి. ఈ నెల 15న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అరకులోయ పర్యటన ఖరారు కావడం, పర్యాటక శాఖ అతిథి గృహాలు, రెస్టారెంట్లు మూతబడి ఉండడంతో అధికారుల్లోనూ గుబులు మొదలైంది. సోమవారం పాడేరు ఐటిడిఎ పిఒ అభిషేక్ అరకులోయలోని హరిత వ్యాలీ రిసార్ట్‌కు వెళ్లి సమ్మె విరమింపజేయడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. వేరే ప్రాంతం నుంచి వర్కర్లను తీసుకొచ్చి పనులు చేయిస్తామని కొందరు అధికారులు బెదిరింపులకు పాల్పడినప్పటికీ కార్మికులు తిప్పికొట్టారు. అదే క్రమంలో పిఒకు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆయన స్పందిస్తూ మంగళవారం పాడేరు ఐటిడిఎ ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు, కార్మిక సంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని తెలిపారు.


అరకులోయలోని సమ్మె శిబిరంలో కార్మికులతో మాట్లాడుతున్న పిఒ అభిషేక్

అనంతగిరి మండలంలో కార్మికుల సమ్మెకు పలు పార్టీల, ప్రజా సంఘాల మద్దతు లభించింది. జడ్‌పిటిసి గంగరాజు, సర్పంచ్‌లు మొస్య, అప్పారావు, సిపిఎం మండల కార్యదర్శి ఎస్ నాగులు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి దేవుడు, గిరిజన, మహిళా సంఘాల నాయకులు మద్దతు తెలిపిన వారిలో ఉన్నారు. సమ్మె శిబిరం వద్ద కళారూపాలు, థింసా నృత్యం ప్రదర్శిస్తూ కార్మికులు తమ సమస్యలను అందరికీ అర్థమయ్యేలా చెబుతున్నారు.

ఆర్‌బికెల్లో బ్యాంకులు

బిజినెస్ కరస్పాండెంట్లను నియమించేందుకు చర్యలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రైతులకు బ్యాంకింగ్ సేవలు మరింత అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం విస్తృత చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే రైతు భరోసా కేంద్రాల్లో బిజినెస్ కరస్పాండెంట్లు (బిసి) ఉండేలా చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే కొన్ని ఆర్‌బికెల్లో బిసిల నియామకం జరగ్గా, మిగిలిన వాటిలోనూ నియమించాలని నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతాల్లో లావాదేవీలకు కావాల్సిన బ్యాంకింగ్ సౌకర్యాలు చాలాచోట్ల లేవు. దీనికోసం రైతులు నగదునే వినియోగించాల్సి వస్తోంది.

ఇది ఇబ్బందులతో కూడుకున్నది కావడంతో వారు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే అన్ని రైతు భరోసా కేంద్రాల్లో బిజినెస్ కరస్పాండెట్లను, బ్యాంకు మిత్రలను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఈ మేరకు బ్యాంకర్లకు పలు సూచనలు చేసింది. తాజాగా రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి నుంచి బ్యాంకు శాఖలకు సర్క్యులర్లు జారీ కావడం గమనార్హం. బిజినెస్ కరస్పాండెంట్లకు సంబంధించిన స్టాండింగ్ ఆపరేషనల్ ప్రోసీజర్ (ఎస్‌ఒపి), జాబ్ చార్ట్‌ను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ మొత్తం ప్రక్రియను జిల్లాల్లోని లీడ్ బ్యాంకు మేనేజర్లు నిర్వహించాల్సిందిగా సర్క్యులర్‌లో స్పష్టం చేశారు.

LIC HFL — LIC HOUSING FINANCE LTD
ఎల్‌ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
డి నెం. 23బి-9-16/2, 1వ అంతస్తు, బి.పి.ఎల్. ప్లాజా, త్రినాథ్ లైఫ్‌స్టైల్ ఎదరుగా, ఆర్.ఆర్. పేట, ఏలూరు-534002.

స్వాధీనత ప్రకటన
(స్థిరాస్తి కొరకు) SARFA&ESI చట్టం, 2002 (అనుబంధం-IV) రూల్ 8(1) క్రింద

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం **ఎల్‌ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఏలూరు ఏరియా ఆఫీసు** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13(12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీత: శ్రీ. రాజమహేంద్రవరపు ప్రసాద్ (మరణించిన ఋణగ్రహీత), శ్రీమతి. హేమలత రాజమహేంద్రవరపు (సహ-ఋణగ్రహీత), శ్రీ. కోటి సూర్య వినయ్ రాజమహేంద్రవరపు (సహ-ఋణగ్రహీత), శ్రీమతి. గరికపాటి వాసంతి (లేటు శ్రీ. రాజమహేంద్రవరపు ప్రసాద్ యొక్క కుమార్తె) నివాసపు డోర్ నెం.9-116, బి.సి. కాలనీ, విస్సన్నపేట-521215, కృష్ణా జిల్లా (లోన్ నెంలు: 720400000596, 720400000379, 720400000378)** వారిని నోటీసులో ఉదహరించబడిన ఎల్‌ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు చెల్లించవలసిన బకాయి **రూ. 68,54,422.70 (అక్షరాల అరవై ఎనిమిది లక్షల యాభై నాలుగు వేల నాలుగు వందల ఇరవై రెండు రూపాయలు మరియు డబ్బై పైసలు)** + తేది. 10/12/2022 నుండి తదుపరి వడ్డీ మొ॥నవి మొత్తంను నోటీస్ అందిన తేది నుండి 60 రోజులలోపు చెల్లించవలసినదిగా కోరుతూ తేది 09/12/2022న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది. సదరు నోటీసు బట్వాడా కాకుండా తిరిగి వచ్చినది, కావున ఆ నోటీసును తేది 06.08.2023న ఈనాడు మరియు ది హిందూ దినపత్రికలలో ప్రచురించడమైనది.

పైన పేర్కొన్న ఋణగ్రహీత, సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, ఎల్‌ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002లోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్ 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ తెలిపిన ఆస్తిని **తేది 09.11.2023 న సూచనప్రాయంగా స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలియచేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **ఎల్‌ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 68,54,422.70 (అక్షరాల అరవై ఎనిమిది లక్షల యాభై నాలుగు వేల నాలుగు వందల ఇరవై రెండు రూపాయలు మరియు డబ్బై పైసలు)** + వర్తించు తదుపరి వడ్డీ మరియు ఖర్చులు కలిపి మొత్తమునకు లోబడి వుంటాయి.

చట్టం నందలి సెక్షన్ 13, సబ్-సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీత'లు తమ యొక్క తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని కోరడమైనది.

షెడ్యూలు స్థిరాస్తి వివరములు: విస్సన్నపేట-521215, కనకదుర్గ గుడి దగ్గర, ద్వారకానగర్, సమీప డి.నెం. 9-162, ఆర్.ఎస్. నెం.140/2 నందు **484 చ॥గ॥ లేదా 405 చ॥మీ॥. హద్దులు:** తూర్పు: ఎ. రంగనాయకులు ఆస్తి, దక్షిణం: బంధువల ఆస్తి, పడమర: మార్కెట్ ఏరియా, ఉత్తరం: కేతుపల్లి వెంకటేశ్వరరావు ఆస్తి.

తేది: 09.11.2023 — సం/- అధీకృత అధికారి
ప్రదేశం: ఏలూరు — ఎల్‌ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

24 గంటల విద్యుత్ సరఫరాకు కృషి

- ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులకు 24 గంటలు నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరాను కొనసాగించేందుకు విద్యుత్ సంస్థలు కృషి చేస్తున్నాయని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్నారు. సోమవారం వెబ్‌నార్ ద్వారా ఇంధనశాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ రంగంలో ఉద్యోగులు అనేక సవాళ్లను అధిగమించి పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను సాధించడంలో సఫలీకృతం అయ్యారని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరిగిందన్నారు. విద్యుత్ సంస్థలు ఈ ఏడాది జూన్ 16న ఎటువంటి విద్యుత్ లోటు లేకుండా గరిష్ఠంగా 263.24 మిలియన్ యూనిట్లు విద్యుత్‌ను సరఫరా చేశాయని, ఈ ఏడాది అక్టోబరు 19 నాటికి 13,028 మెగావాట్ల డిమాండ్‌ను చేరుకున్నాయని అన్నారు. ఇది ఇప్పటి వరకు రాష్ట్రంలోనే అత్యధిక డిమాండ్ అని తెలిపారు. అయినప్పటికీ ఇటువంటి అసాధారణ పరిస్థితులను అధిగమించామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుండి అక్టోబరు వరకు విద్యుత్ డిమాండ్ 41,140 మిలియన్ యూనిట్లు కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి 48,522 మిలియన్ యూనిట్లు డిమాండ్ ఉందన్నారు. గతేడాది అక్టోబరులో డిమాండ్ 5,556.6 మిలియన్ యూనిట్లు ఉండగా, ఈ అక్టోబరులో 7,270.55 మిలియన్ యూనిట్లు డిమాండ్‌తో 30.8 శాతం పెరిగిందన్నారు. ఎపి ట్రాన్స్‌కో జెఎమ్‌డి చక్రధర్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అతి తక్కువ వర్షపాతం కారణంగా ఆశించిన స్థాయిలో హైడల్ ఉత్పత్తి జరగలేదన్నారు. థర్మల్ విద్యుదుత్పత్తి మెరుగుపరచడానికి బొగ్గు నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు థర్మల్ విద్యుదుత్పత్తి 14,948 మిలియన్ యూనిట్ల నుండి ఈ ఏడాది 17,107 మిలియన్ యూనిట్లకు పెరిగిందని తెలిపారు. 2022-23లో ఆర్‌టిపిపి స్టేషన్‌లో యూనిట్ల లభ్యత 67.85 శాతం నుంచి 75.68 శాతానికి పెరిగిందన్నారు. ఈ సమావేశంలో అధికారులు పృథ్వీతేజ్, పద్మ జనార్ధన్‌రెడ్డి, సంతోష్‌రావు, బి మల్లారెడ్డి, భాస్కర్, వీరభద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20న పోలవరం పురోగతిపై కీలక భేటీ

- ముంపు సమస్య, సవరించిన అంచనా, ప్రాజెక్టు పూర్తే అజెండాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి కీలకమైన పోలవరం ప్రాజెక్టుపై ఈ నెల 20న ఢిల్లీలో కీలక భేటీ జరగనుంది. వర్షాకాలం ముగియడం గోదావరి నదిలో వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడం వేసవికాలం రానుండటంతో నిర్మాణ పనులకు సంబంధించి సమావేశం జరగనుంది. కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో పోలవరం ముంపు సవరించిన అంచనాల ఆమోదం తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిసింది. కేంద్ర జలశక్తిశాఖ కార్యదర్శి ముఖర్జీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో కేంద్ర జలసంఘం చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా, జలశక్తిశాఖ సలహాదారు శ్రీరాం వెదిరె, పోలవరం ప్రాజెక్టు అథారిటీ సిఇఒ శివ్‌నందన్‌కుమార్, సభ్య కార్యదర్శి రఘురాం, రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఇఎన్‌సి సి నారాయణ రెడ్డితో పాటు పోలవరం ప్రాజెక్టు సిఇ సుధాకర్‌బాబు, తెలంగాణ అధికారులు పాల్గొననున్నారు. ముంపుపై నిపుణలతో రీసర్వే చేయడంపైనా చర్చించనున్నారు. అలాగే ప్రస్తుత సీజన్‌లో చేపట్టాల్సిన పనులు, అందుకు కార్యాచరణ ప్రణాళిక ఏమిటనేది ఈ సమావేశంలో ఖరారు చేయనున్నారు. ప్రాజెక్టు తొలిదశ సవరించిన అంచనా రూ.31,625.38 కోట్లుగా కేంద్ర జలసంఘం ఖరారు చేసింది. ఇందులో ఇప్పటికే రూ.16,119.57 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులకు రూ.15,505.81 కోట్లు అవసరమని కేంద్ర జలశక్తిశాఖ నివేదిక ఇచ్చింది. సవరించిన అంచనా వ్యయాన్ని ఖరారు చేసేందుకు కేంద్ర ఆర్థికశాఖ రివైజ్డ్ కాస్ట్ కమిటీని నియమించింది. ఆ కమిటీ అడిగిన వివరాలను ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం నివేదించనున్నట్లు తెలిసింది.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్
బ్రాంచ్ ఆఫీస్ 22/1223/ఎ-1, 1వ అంతస్తు, జి.టి.రోడ్డు, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్-524003.

డిమాండ్ నోటీసు
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యొక్క 13(2) క్రింద)

ఇందుమూలంగా **యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్** (ఇంతకు పూర్వము యు.టి.ఐ బ్యాంక్ లిమిటెడ్ గా తెలిసిన) యొక్క అధీకృత అధికారి వారి **రిజిష్టర్డ్ కార్యాలయము : "త్రిసూల్", సామర్తేశ్వర్ గుడి ఎదురుగా, ఎల్లిస్‌బ్రిడ్జ్, అహ్మదాబాద్-380006**, ఇతర ప్రదేశములలో ఉన్న బ్రాంచిలు నందు గల **బ్రాంచి ఆఫీస్ యాక్సిస్ బ్యాంక్ లి., 22/1223/ఎ-1, 1వ అంతస్తు, జి.టి.రోడ్డు, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్-524003 మరియు కార్పొరేట్ ఆఫీస్ బొంబాయి డైయింగ్ మిల్స్ కాంపౌండ్, పాండురంగ్ బుద్కర్ మార్గ్, వొర్లి, ముంబాయి-400025** సెక్యూర్డ్ క్రెడిటార్ వారి యొక్క పైన పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద ఈ నోటీసు జారీ చేయడమైనది.

అప్లికెంట్/కో-అప్లికెంట్/హామీదారుల యొక్క పేర్లు / ఖాతా నెం.లు : 1) శ్రీ వేమరెడ్డి విజయ కేతన్ రావు, తండ్రి. రంగారావు వేమరెడ్డి, డి.నెం.20/4-59, దనియాలపేట, గుడివాడ, కృష్ణా జిల్లా-521301. **2) శ్రీమతి వేమరెడ్డి వెంకట శివ నాగ లక్ష్మి, భర్త. వేమరెడ్డి విజయ కేతన్ రావు,** డి.నెం.20/4-59, దనియాలపేట, గుడివాడ, కృష్ణా జిల్లా-521301. **3) శ్రీ వేమరెడ్డి సీతారామయ్య, తండ్రి. రంగారావు వేమరెడ్డి,** డి.నెం.20-89, దనియాలపేట, గుడివాడ, కృష్ణా జిల్లా-521301. **శ్రీమతి బోనం వాసవి కన్యక పరమేశ్వరి, భర్త. వేమరెడ్డి సీతారామయ్య,** డి.నెం.20-89, దనియాలపేట, గుడివాడ, కృష్ణా జిల్లా-521301.

అకౌంట్ నెం. : 919030031670689 & 919030031670692 ఎ.పి.ఎ తేదీ : 02.05.2023 డిమాండ్ నోటీసు తేదీ : 25.08.2023

బకాయి మొత్తం : తేది.03.05.2023 నుండి తదుపరి వడ్డీతో (ఈ మొత్తం వడ్డీ సహా ప్లస్ **02.05.2023** వరకు జరిమానా ఛార్జీలు) ఒప్పందం యొక్క ముగింపు మీద మొత్తం కలిగిన బకాయిలు **తేది.02.05.2023 నాటికి రూ.23,64,163/- (అక్షరాల ఇరవై మూడు లక్షల అరవై నాలుగు వేల నూట అరవై మూడు రూపాయలు మాత్రమే)**

షెడ్యూల్ ఆస్తి వివరములు : కృష్ణా జిల్లా, గుడివాడ, బేతవోలు, గుడివాడ యొక్క అధికార పరిధిలోని, గుడి సబ్ రిజిస్ట్రీ, ఆర్.ఎస్.నెం. 40/5 లోని 250 చ॥గ॥లు విస్తీర్ణంలోని డి.నెం.3-330 తో ఉన్న ఆస్తి **శ్రీ వేమరెడ్డి విజయ కేతన్ రావు గారి** పేరున కలదు. అమ్మకం **దస్తావేజు నెం.3818/2015, తేది.20.07.2015, గుడివాడ యొక్క ఎస్.ఆర్.ఓ ప్రకారం. హద్దులు : తూర్పు :** బజార్ - 45 అ॥లు, **దక్షిణం :** వేమరెడ్డి వెంకట సుబ్బయ్య గారి స్థలం - 50 అ॥లు, **పడమర :** మిడియాల జయమ్మ గారి స్థలం - 45 అ॥లు, **ఉత్తరం :** బోనం నరసింహా రావు గారి స్థలం - 50 అ॥లు.

ఈ పై హద్దుల యందు విస్తీర్ణం 250 చ॥గ॥లులోని ఆర్.సి.సి. నిర్మాణాలతో కలదు.

SARFAESI చట్టం యొక్క సెక్షన్ 13(2) నియమాల ప్రకారం పైన తెలిపిన వ్యక్తులు తదుపరి వడ్డీలు మరియు ఇతర ఖర్చులను తిరిగి చెల్లించడంలో విఫలం చెందియున్నారు. **SARFAESI** చట్టం యొక్క సెక్షన్ 13(4) మరియు ఇతర చట్టాల ప్రకారం బ్యాంకు వారు ఈ నోటీసు జారీ చేసిన 60 రోజులలోగా అధీనంలోకి తీసుకోబడుతుంది. ఈ నోటీసు బ్యాంకు వారికి ఎటువంటి పక్షపాతం లేకుండా మొదలుపెట్టే ఇతర చర్యలు మరియు న్యాయపరమైన విధానాలు ఉన్న చట్టాల ప్రకారం దీనిని చేయాల్సి ఉంది.

తేది : 10.11.2023 ప్రదేశము : నెల్లూరు — సం/- అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

చంద్రమోహన్‌కు అంతిమ వీడ్కోలు

- ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

అనారోగ్యంతో కన్నుమూసిన ప్రముఖ నటులు చంద్రమోహన్ అంత్యక్రియలు హైదరాబాద్ లోని పంజాగుట్ట శ్మశానవాటికలో సోమవారం కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఫిల్మ్ నగర్‌లోని ఆయన నివాసంలో సినీ ప్రముఖులు వెంకటేశ్, రాజశేఖర్, జీవిత, నిర్మాత ఆదిశేషగిరిరావు, మాదాల రవి తదితరులు చంద్రమోహన్ భౌతికకాయానికి నివాళులర్పించారు. ప్రత్యేక అలంకరించిన వాహనంలో ఫిల్మ్‌నగర్‌లోని ఆయన నివాసం నుంచి ఉదయం పది గంటల సమయంలో అంతిమయాత్ర ప్రారంభమైంది. సినీ ఆర్టిస్టులు, చంద్రమోహన్ అభిమానులు అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చంద్రమోహన్‌కు కడసారి వీడ్కోలు పలికారు. అనంతరం పంజాగుట్టలోని శ్మశాన వాటికలో చంద్రమోహన్ సోదరుడు మల్లంపల్లి దుర్గాప్రసాద్ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. అనారోగ్యంతో జూబ్లీహిల్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చంద్రమోహన్ శనివారం మృతి చెందిన విషయం విదితమే.

మున్నేరులో ముగ్గురు మృతి

- ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి- కంచికచర్ల (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల మండలం కీసర సమీపంలోని మున్నేరు వాగులో ఈతకు దిగిన ఐదుగురు యువకుల్లో ముగ్గురు మరణించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. నందిగామ మండలం ఐతవరం గ్రామానికి చెందిన ఎనిమిది మంది యువకులు సరదాగా ఈత ఆడేందుకు కంచికచర్ల మండలం కీసర సమీపంలోని మున్నేరు వాగు వద్దకు వచ్చారు. పాత లోలెవల్ వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో అక్కడికి వెళ్లారు. అయితే, ఈ ప్రాంతంలో ఇసుక తవ్వకాల వల్ల పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ముగ్గురు ఒడ్డున ఉండగా.. ఐదుగురు ఈతకు దిగారు. నీటి ప్రవాహానికి ఒక్కసారిగా అందరూ ఇసుక గుంతల్లో చిక్కుకుపోయారు. గమనించి పశువుల కాపారులు స్థానికులకు సమాచారం అందించారు. అందరూ కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. నీటి గుంతల్లో ఇరుక్కుపోయి ఊపిరాడక చేజెర్ల. వినిష్ (17), జి.సంతోష్ కుమార్ (24) యడవల్లి గణేష్ (29) మరణించారు. రవి, సిద్ధూ అపస్మారక స్థితికి చేరుకున్నారు. వీరిని ముందు నందిగామ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. చేజెర్ల. వినిష్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం, సిద్ధూ ఇంజనీరింగ్ చదువుతున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా యడవల్లి గణేష్ పనిచేస్తున్నారు. సంతోష్‌కుమార్, రవి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ఆస్పత్రికి పోలీసులు తరలించారు.

మృతి చెందిన యువకులు

మున్నేరులో యువకుల మృతిపై సిపిఎం సంతాపం

ఎన్‌టిఆర్ జిల్లా కీసర దగ్గర మున్నేరులో మునిగి ముగ్గురు యువకులు మరణించడం పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ప్రకటన విడుదల చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మరణించిన కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, ఇలాంటి ఘటనలు తరచూ జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం స్నాన ఘట్టాలకు తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని కోరారు.

RELIANCE Asset Reconstruction
రిలయన్స్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్
11వ అంతస్తు, ఉత్తరం వైపు, ఆర్-టెక్ పార్కు, వెస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవే, గోరెగాన్ (ఈస్ట్), ముంబయి-400063.

సెక్యూర్డ్ అసెట్స్ అమ్మకం కొరకు ప్రకటన

ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నియమాలతో చదువబడే, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.

[illegible]

ప్రదేశం: విజయవాడ
తేది: 14.11.2023
అధీకృత అధికారి, రిలయన్స్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్.

సంపాదకీయం

ప్రైవేటు గుప్పెట్లోకి గిడ్డంగులు

మినీరత్న కేటగిరిలోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (సిడబ్ల్యుసి) ప్రైవేటీకరణకు మోడీ ప్రభుత్వం దూకుడు మీదుంది. కేంద్రంలో రెండవ తడవ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వరంగ సంస్థల (పిఎస్‌యు) మోనిటైజేషన్ (నగదీకరణ) ప్రణాళికను సర్కారు వెల్లడించగా, అన్ని వర్గాల నుంచి విమర్శలు రావడంతో కొంత స్తబ్ధుగా కనిపించినా చాపకింద నీరులా మోనిటైజేషన్ పైప్‌లైన్‌లోని ప్లాన్లను ఒక్కొక్కటిగా ఆచరణలో పెడుతోంది. అందులో భాగమే సిడబ్ల్యుసి గిడ్డంగుల ప్రైవేటీకరణ. తెలుగు రాష్ట్రాల్లోని ఆరు ప్రదేశాలతో సహా దేశ వ్యాప్తంగా 54 చోట్ల సిడబ్ల్యుసి గోదాముల ప్రైవేటీకరణ నిమిత్తం రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ సేవల సంస్థ 'నైట్‌ఫ్రాంక్'తో సిబ్ల్యుసి ఒప్పందం కుదుర్చుకుంది. సిడబ్ల్యుసి భూముల్లో అధునాతన వసతులతో నైట్‌ఫ్రాంక్ గోడౌన్లు నిర్మిస్తుంది. వాటిని 45 సంవత్సరాల లీజు ప్రాతిపదికన హస్తగతం చేసుకొని వ్యాపారం చేసుకుంటుంది. అద్దెల ద్వారా లభించిన నికర ఆదాయంలో ఐదు శాతం వాటా మాత్రమే సిడబ్ల్యుసికి వస్తుంది. తతిమ్మా 95 శాతమూ నైట్‌ఫ్రాంక్ కైవసం చేసుకుంటుంది. దీనికి బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ అని ముద్దు పేరు పెట్టారు. విలువైన భూములేమో సిడబ్ల్యుసివి, ఆదాయమేమో ప్రైవేటు సంస్థది. సొమ్మొకడిది సోకొకడిది అంటే ఇదేనేమో!

వినియోగదారులు, ఆహారం, ప్రజాపంపిణీ మంత్రిత్వశాఖ పరిధిలోనిది సిడబ్ల్యుసి. ప్రత్యేక చట్టం ద్వారా 1962లో నెలకొల్పిన సిడబ్ల్యుసికి దేశ వ్యాప్తంగా 104 లక్షల సామర్థ్యం కలిగిన 458 గిడ్డంగులున్నాయి. అవి కాకుండా 19 రాష్ట్రాల వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ల కింద 50 శాతం షేర్‌పై 439 లక్షల టన్నుల కెపాసిటీ కలిగిన గోడౌన్లున్నాయి. గిడ్డంగుల్లో ఆహార ధాన్యాలను నిల్వ చేసేందుకు తొలి ప్రాధాన్యమివ్వాలి. ఆ తర్వాత ప్రభుత్వరంగ సంస్థల సరుకుల నిల్వలకు అనుమతించాలి. అనంతరమే ప్రైవేటు సంస్థలకు అద్దెలకివ్వాలి. ప్రభుత్వాలు ప్రైవేటీకరణ విధానాలను ఎప్పుడైతే అమలు చేయనారంభించాయో ఈ ప్రాథమ్యాల్లో మార్పులు రాసాగాయి. చివరికి పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే ఆహార ధాన్యాల నిల్వలకు ఖాళీ లేదంటూ ప్రైవేటు సంస్థల వస్తువులు నిల్వ చేసే వరకు వచ్చింది. మోడీ సర్కారు మరో అడుగు ముందుకేసి మోనిటైజేషన్ పైప్‌లైన్‌లో సిడబ్ల్యుసిని చేర్చింది. అందులో భాగంగా గోదాముల ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వం దూసుకెళుతోందని తాజాగా నైట్‌ఫ్రాంక్‌తో కుదుర్చుకున్న ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) ఒప్పందం ద్వారా రూఢీ అవుతోంది.

ప్రభుత్వరంగ సంస్థలకు దేశ వ్యాప్తంగా ఉన్న అత్యంత విలువైన భూములపై కార్పొరేట్ల కన్ను పడింది. ఆ భూములను మోడీ సర్కారు తమకు అనుకూలమైన సంస్థలకు ధారాదత్తం చేసే ప్రణాళికే మోనిటైజేషన్ అని వేరే చెప్పనవసరం లేదు. సిడబ్ల్యుసికి వివిధ రాష్ట్రాల్లో 572 ఎకరాల ఖాళీ భూములున్నాయి. వాటిలో 344 ఎకరాలను అమ్ముకొని నిధులు సమీకరించడం కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రాజెక్టులో నైట్‌ఫ్రాంక్ సంస్థ రూ.రెండు వేల కోట్లకుపైన పెట్టుబడులు పెడుతుందంటున్నారు. గతంలో గోదాముల నిర్వహణ బాధ్యత సిడబ్ల్యుసి, ఎస్‌డబ్ల్యుసిలకు ఉండేది. ఇప్పుడు భూములను, భవనాలను, వాటిలో అద్దెల నిర్ణయం, అన్నింటిపైనా ప్రైవేటు సంస్థలకు ఆధిపత్యం, అధికారం వస్తుంది. కేవలం నామమాత్రంగా లీజులు తీసుకునే పనే సిడబ్ల్యుసిది. మోడీ సర్కారు వచ్చాక ఆహార ధాన్యాల సేకరణ తగ్గిపోతోంది. పిడిఎస్ కోతలకు గురవుతోంది. దీని వలన అటు రైతులకు కనీస మద్దతు ధరలు పడట్లేదు, ఇటు వినియోగదారులకు రేట్లు పెరుగుతున్నాయి. ప్రభుత్వ గోదాములు కాస్తా కార్పొరేట్ల గుప్పెట్లోకి పోతే భవిష్యత్తులో ఆహార భద్రత ప్రశ్నార్ధకమవుతుంది. మన రాష్ట్రంలో రాయనపాడు, పెదకాకాని, నెల్లూరు, అనకాపల్లిలో గోదాములను నైట్‌ఫ్రాంక్‌కు ఇచ్చారు. మన రాష్ట్ర ప్రభుత్వం కనీసమాత్రం స్పందించట్లేదు. పైగా కేంద్రం చెప్పినట్లు గోదాముల ఆన్‌లైన్ నిర్వహణ కోసం డిజిటలైజేషన్‌ను ప్రారంభించింది. కార్పొరేట్ల కోసం మోడీ ప్రభుత్వం డిజైన్ చేసిన మోనిటైజేషన్ ప్రోగ్రాంను, గోదాముల అమ్మకాలను ప్రజలందరూ వ్యతిరేకించాలి.

మహనీయుల మాట



సమయానికి కొలమానం సంవత్సరాలు గడిచిపోవడం కాదు. ఆ కాలంలో మనం ఏం చేశాం, ఎలా ఉన్నాం, ఏం సాధించామన్నది ముఖ్యం.

- జవహర్‌లాల్ నెహ్రూ,
భారత ప్రథమ ప్రధాని.

పెరుగుతున్న నిరుద్యోగ సంక్షోభం



ప్రభాత్ పట్నాయక్

మన ఆర్థిక వ్యవస్థలో పని చేయగలిగిన వారిలో ఎంతమంది "ఉద్యోగులు", ఎంతమంది "నిరుద్యోగులు" అని స్పష్టంగా విభజించి చూడడం సాధ్యం కాదు. పలువిధాలుగా కాజువల్ ఉద్యోగాలు ఉండడమే గాక, ఆ విధమైన ఉద్యోగాల సంఖ్య కూడా భారీగా పెరుగుతోంది. అందుచేత స్పష్టంగా నిరుద్యోగం ఎంత ఉందో నిర్ధారించడం చాలా చిక్కులతో కూడుకున్న పని. "గత ఏడాది కాలంలోనో, గత ఆరు నెలల కాలంలోనో మీకు ఎన్ని రోజులు పని దొరికింది, రోజుకు ఎన్ని గంటల చొప్పున దొరికింది" అని సర్వేలో వ్యక్తులను అడగాలి. ఎంతగడువు ను కొలబద్దగా ఎంచుకున్నాం, ఎన్ని గంటల పని చేస్తే పూర్తి స్థాయి ఉపాధి దొరికినట్టు పరిగణిస్తాం అన్న దానిని బట్టి నిరుద్యోగం ఎంత మోతాదులో ఉందో నిర్ధారించడం జరుగుతుంది. జాతీయ శాంపిల్ సర్వేలో (1) సాధారణంగా ఉపాధి ఉంటోందా? (2) వారంలో ఎన్ని రోజులు ఉపాధి దొరుకుతోంది? (3) ఏ రోజుకు ఆ రోజు ఉపాధి దొరుకుతోందా?-ఇలా మూడు రకాల ప్రమాణాలను వాడతారు. ప్రతీ ఏడూ చిన్న సైజు శాంపిల్‌నే తీసుకున్నా ఐదేళ్ళకు ఒకసారి పెద్ద సైజు శాంపిల్‌ను తీసుకుని సర్వే చేస్తారు. జాతీయ శాంపిల్ సర్వే ఫలితాలను ఏడాదికొకమారు ప్రకటిస్తారు.

సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఎకానమీ అనే ఒక ప్రభుత్వేతర సంస్థ ప్రతీ నెలా నిరుద్యోగ సర్వే నిర్వహిస్తుంది (పట్టణాల్లో ప్రతీ వారమూ నిర్వహిస్తారు). సర్వే జరిగిన రోజున ఉపాధి లభించినదీ లేనిదీ అడుగుతారు. పని చేయడానికి సిద్ధంగా ఉన్న మొత్తం శ్రామిక ప్రజానీకంలో ఎంత శాతానికి ఉపాధి లభించినదీ లెక్కించి దాని ఆధారంగా నిరుద్యోగం ఎంత శాతం ఉందో నిర్ధారిస్తారు. ఈ సంస్థ అనుసరించే విధానం పట్ల ఎవరికైనా అభ్యంతరాలు ఉండవచ్చు కాని ఆ సంస్థ వెల్లడించే గణాంకాలు చాలా కాలంగా ఆమోదయోగ్యంగా ఉన్నాయి. అందుచేత నిరుద్యోగంలో ఉన్న ధోరణులను పరిశీలించడానికి అవి ప్రాతిపదికగా చాలామంది, ముఖ్యంగా పరిశోధకులు తీసుకుంటున్నారు.

సి.ఎం.ఐ.ఇ తాజాగా విడుదల చేసిన గణాంకాలు 2023 అక్టోబరు మాసానికి సంబంధించినవి. వాటిని బట్టి చూస్తే దేశంలో నిరుద్యోగం 10.05 శాతం ఉంది. అందులో గ్రామీణ నిరుద్యోగం 10.82 శాతం ఉంటే, పట్టణాల్లో 8.44 శాతం ఉంది. సెప్టెంబరు మాసంలో 7.09 శాతం ఉంటే అక్టోబర్ నెలలో చాలా ఎక్కువ మోతాదులో పెరుగుదల కనిపిస్తోంది (2020లో మోడీ ప్రభుత్వం హఠాత్తుగా లాక్‌డౌన్ ప్రకటించాక నిరుద్యోగం అమాంతం పెరిగిపోయింది.). మే 2021లో కరోనా అదుపులోకి వచ్చాక మళ్ళీ ఎక్కువగా పెరుగుదల కనిపిస్తున్నది ఇప్పుడే.

> **చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగంలో అత్యధిక స్థాయిలో ఉపాధికి అవకాశాలు ఉంటాయి. అటువంటి రంగం కోలుకోడానికి దోహదం చేయని ఆర్థిక వృద్ధి స్వభావం వలన ఒకపక్క ఆర్థిక వృద్ధి రేటు పెరుగుతున్నట్టు కనిపిస్తున్నా, ఉపాధి అవకాశాలు మాత్రం ఏమాత్రమూ పెరగలేదు.**

గత ఐదు సంవత్సరాలుగా మన దేశంలో పని చేస్తున్నవారి సంఖ్య 40 కోట్లుగా, ఎటువంటి పెరుగుదలా లేకుండా ఉంటోంది. అంటే గడిచిన ఐదేళ్ళలోనూ కొత్తగా ఉపాధి అవకాశాలు పెరగలేదని గ్రహించాలి. ఈ అక్టోబర్ మాసంలో నిరుద్యోగంలో ఒక్కసారి ఎక్కువగా పెరుగుదల కనిపించింది. అదే నెలలో ఉపాధి కోసం ప్రయత్నించేవారి సంఖ్య కూడా అదే మోతాదులో పెరిగింది. అంటే ఉపాధి పొందుతున్నవారి సంఖ్యలో ఏ మార్పూ లేదు. దీనిని బట్టి భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ఉపాధి అవకాశాలలో పెరుగుదల లేకపోవడం అనేది ప్రధాన ధోరణిగా ఉందని మనం గ్రహించాలి.

సి.ఎం.ఐ.ఇ లెక్కల ప్రకారం 2019లో 5.27 శాతం ఉన్న నిరుద్యోగం 2020 లో 8 శాతానికి పెరిగింది. ఆ తర్వాత రెండు సంవత్సరాలలో అది 5.98 శాతం, 7.33 శాతం గా నమోదైంది. 2023లో అది మరింత పెరిగింది.

> **పెట్టుబడిదారులు మరింత ఎక్కువగా పెట్టుబడులు పెట్టేలా వారిని ప్రోత్సహించడమే ప్రధాన సూత్రంగా మోడీ ప్రభుత్వ విధానాలు రూపొందాయి. పెట్టుబడులు ఎంత పెరిగితే ఆర్థికవృద్ధిరేటు అంత ఎక్కువ పెరుగుతుంది అన్నది దీని వెనుక ఆలోచన.**

ఇప్పుడు దేశంలో ఉపాధి కోరుతున్న శ్రామిక జనం సంఖ్య పెరుగుతున్నా, లభిస్తున్న ఉద్యోగాలు మాత్రం ఏ పెరుగుదలా లేకుండా యథాతథంగా ఉన్నాయి. యుక్త వయస్సు వచ్చి ఉపాధి కోరుకుంటున్నవారి సంఖ్య ఏటా ఏ మోతాదులో పెరుగుతోందో, కనీసం ఆ మోతాదులో కూడా ఉపాధి అవకాశాలు పెరగడం లేదు.

కొంతమంది వ్యాఖ్యాతలు ఉపాధి అవకాశాలలో పెరుగుదల లేకపోడానికి కారణం మన దేశ ఆర్థిక వ్యవస్థ ఇంకా కరోనా మహమ్మారి దెబ్బ నుండి పూర్తిగా కోలుకోలేకపోవడమే అని అంటున్నారు. ఈ వ్యాఖ్యానంలో ఏ కాస్తైనా పస ఉన్నదని అనుకుంటే వాళ్ళు వాస్తవ జిడిపిలో వృద్ధి ని ప్రమాణంగా తీసుకున్నట్టు భావించాలి. మహమ్మారి అనంతరం మన జిడిపి పుంజుకుంటున్న వేగం నిస్సందేహంగా చాలా నెమ్మదిగా ఉంది. కాని ప్రభుత్వం మాత్రం ప్రపంచంలోనే అతి వేగంగా జిడిపి పెరుగుతున్న దేశం మనది అంటూ గొప్పలు పోతోంది. ఏదేమైనా, ఈ జిడిపిలో వృద్ధి రేటు పెరుగుదల తక్కువగా ఉందనే ఒక్క విషయమే ప్రస్తుత పరిస్థితిని వివరించేందుకు సరిపోదు. ఉదాహరణకి, 2019తో పోల్చుకుంటే మన వాస్తవ జిడిపి 2023 నాటికి 16 శాతం పెరిగింది. మరి ఆ మేరకైనా ఉపాధి అవకాశాలు 2019తో పోల్చుకుంటే పెరగాలి కదా. కాని అలా పెరగలేదు. అంటే జిడిపి పెరుగుదల స్వభావం ఏమిటో మనం పరిశీలించాలి. కేవలం జిడిపి వృద్ధి రేటు పెరిగినంత మాత్రాన ఉపాధి అవకాశాలు వాటంతట అవే పెరిగిపోతాయని అనుకోలేము. ఈ వృద్ధి ఏ విధంగా సాధ్యపడింది అన్న అంశాన్ని మనం పరిశీలించాలి.

అంతకు పూర్వపు కాలంతో పోల్చితే మన వృద్ధి పెరుగుదల స్వభావం గత కొన్ని సంవత్సరాలుగా మారిపోతున్నది. ఆర్థిక వృద్ధి నమోదౌతున్నా అది ఉపాధి వృద్ధికి దారి తీయడం లేదు. నయా ఉదారవాద విధానాల కారణంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగం ప్రతికూల పరిస్థితులనెదుర్కుంటోంది. ఈ రంగానికి ప్రభుత్వం ఇచ్చే తోడ్పాటును క్రమంగా ఉపసంహరించారు. పైగా విదేశీ సరుకుల దిగుమతులమీద ఏ ఆంక్షలూ లేకపోవడంతో ఈ రంగానికి పోటీ బాగా పెరిగిపోయింది. ఆ పోటీని తట్టుకునే విధంగా ప్రభుత్వం తోడ్పడి వుండాలి. కాని దానికి భిన్నంగా అంతవరకూ ఉన్న తోడ్పాటునే వెనక్కి తీసుకున్నారు. పులి మీద పుట్రలాగా మోడీ ప్రభుత్వం పెద్దనోట్ల రద్దును హఠాత్తుగా అమలు చేసింది. జిఎస్‌టి విధానం గుదిబండ అయింది. ఇవన్నీ చాలవన్నట్టు కోవిడ్ కాలంలో విధించిన లాక్‌డౌన్ దెబ్బకి ఈ రంగం పూర్తిగా కుదేలైంది. ఇప్పటికీ ఈ రంగం ఆ స్థితి నుండి కోలుకోనేలేదు. కోవిడ్ అనంతర కాలంలో ఆర్థిక వృద్ధిరేటు పెరిగినా, అది ఈ రంగానికి ఏ విధంగానూ ఉపయోగపడేదిగా లేదు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగంలో అత్యధిక స్థాయిలో ఉపాధికి అవకాశాలు ఉంటాయి. అటువంటి రంగం కోలుకోడానికి దోహదం చేయని ఆర్థిక వృద్ధి స్వభావం వలన ఒకపక్క ఆర్థిక వృద్ధి రేటు పెరుగుతున్నట్టు కనిపిస్తున్నా, ఉపాధి అవకాశాలు మాత్రం ఏమాత్రమూ పెరగలేదు.

బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్థిక విధానాలు ఉపాధి అవకాశాలను పెంచడానికి ఏ మాత్రమూ తోడ్పడవని దీనిని బట్టి స్పష్టం అవుతోంది. పెట్టుబడిదారులు మరింత ఎక్కువగా పెట్టుబడులు పెట్టేలా వారిని ప్రోత్సహించడమే ప్రధాన సూత్రంగా మోడీ ప్రభుత్వ విధానాలు రూపొందాయి. పెట్టుబడులు ఎంత పెరిగితే ఆర్థికవృద్ధిరేటు అంత ఎక్కువ పెరుగుతుంది అన్నది దీని వెనుక ఆలోచన. అయితే, ఈ విధానాలు నిరుపయోగం. మొదటి కారణం: కొద్దిమంది గుత్తాధిపతుల ఆధిపత్యంలో మార్కెట్ నడుస్తున్నప్పుడు మార్కెట్‌లో కొనుగోలుశక్తి, లేదా డిమాండ్ ఎంతమేరకు పెరగవచ్చు అన్న అంచనాను బట్టి పెట్టుబడులను ఎంతమేరకు పెంచాలి అన్నది నిర్ణయించడం జరుగుతుంది. అంటే మార్కెట్‌లో కొనుగోలుశక్తి పెంచే చర్యలను తీసుకుంటేనే అదనంగా పెట్టుబడులు వస్తాయి. డిమాండ్‌ను పెంచే చర్యలు లేకపోతే పెట్టుబడిదారులు తమకు లభించిన ప్రోత్సాహకాలను చక్కగా దాచుకుంటారే తప్ప పెట్టుబడులు అదనంగా పెట్టరు. పైగా ఆ పెట్టుబడిదారులకు అదనపు ప్రోత్సాహకాలు ఇవ్వడానికి ప్రభుత్వం తాను చేసే వ్యయాన్ని కుదించుకుంటుంది. దాని ఫలితంగా సంక్షేమానికి పెట్టే ఖర్చు తగ్గి, మార్కెట్‌లో డిమాండ్ తగ్గిపోతుంది. అంటే ప్రభుత్వం ఆశించిన వృద్ధి కూడా ఆచరణలో రాదు. రెండవది: ఒకవేళ ప్రభుత్వం కోరుకున్నట్టుగానే పెట్టుబడిదారులు అదనంగా పెట్టుబడులు పెట్టారని, దాని ఫలితంగా జిడిపి వృద్ధిరేటు పెరిగిందని అనుకున్నా, ఆ వృద్ధి జరిగే రంగాలలో ఉపాధి వృద్ధి మాత్రం జరగదు. ఉపాధి అవకాశాలను కల్పించగల చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వడం నిలిపివేసింది కదా. అదీ కారణం.

> **బడా పెట్టుబడిదారులకు ఉపాధి అవకాశాల కల్పన పేరుతో ప్రభుత్వం అనేక రాయితీలు ఒక పక్క ఇస్తున్నా, తన వంతుగా ఉపాధి అవకాశాలను కల్పించే బాధ్యతను మాత్రం ఈ ప్రభుత్వం నెరవేర్చడం లేదు. ప్రభుత్వ రంగంలో ఉన్న ఖాళీలను భర్తీ చేయడానికి పూనుకోవడం లేదు.**

బడా పెట్టుబడిదారులకు ఉపాధి అవకాశాల కల్పన పేరుతో ప్రభుత్వం అనేక రాయితీలు ఒక పక్క ఇస్తున్నా, తన వంతుగా ఉపాధి అవకాశాలను కల్పించే బాధ్యతను మాత్రం ఈ ప్రభుత్వం నెరవేర్చడం లేదు. ప్రభుత్వ రంగంలో ఉన్న ఖాళీలను భర్తీ చేయడానికి పూనుకోవడం లేదు. ఆర్థిక వనరులు తగినంతగా లేకపోవడమే కారణం అని అంటోంది. కాని ఆర్థిక వనరుల కొరత దేని వలన వచ్చింది? పెట్టుబడిదారులకు అదనంగా రాయితీలు ఇచ్చినందువల్ల కాదా? ఒకపక్క నిరుద్యోగం పెరిగిపోతోందని గణాంకాలు వెల్లడి చేస్తూంటే ప్రభుత్వం మరోపక్క గ్రామీణ ఉపాధి హామీ పథకానికి వెచ్చించవలసిన నిధులలో కోత పెడుతోంది.

బడా పెట్టుబడిదారుల కొమ్ము కాసే ఈ బిజెపి ప్రభుత్వం ఆది నుంచీ ఈ ఉపాధి హామీ పథకానికి వ్యతిరేకమే. అధికారంలోకి వచ్చాక ఏదో ఒక కారణంతో ఆ పథకాన్ని నీరుగార్చడానికే ప్రయత్నిస్తోంది. ఇప్పుడు ఆ పథకంలో అవినీతి చోటు చేసుకుంటోందన్న సాకుతో దానిని దెబ్బ తీయడానికి పూనుకుంటోంది. నిరుద్యోగం పెరగడం అనే వాస్తవాన్నే కాకుండా, నిరుద్యోగ సమస్య పట్ల బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరి ఎంత అర్ధరహితమో దానినీ మనం చూడాలి.

(స్వేచ్ఛానుసరణ)

★

సందర్భం

మధుమేహ నివారణ మన చేతుల్లోనే...

డా॥ ఎం.వి. రమణయ్య

ప్రపంచవ్యాప్తంగా ప్రజలను కలవరపెడుతున్న వ్యాధులలో ప్రధానమైనది మధుమేహం. ఈ వ్యాధికి సంబంధించిన వైద్యంలో ఇన్సులిన్ ఇంజక్షన్ చాలా ప్రధానమైనది. ఇన్సులిన్‌ను కనుగొనడం (1922) వైద్యశాస్త్రంలో చెప్పుకోదగ్గ గొప్ప విజయం. బెంటింగ్ అనే శాస్త్రవేత్త తన సహాయక శాస్త్రవేత్త చార్లెస్ బెస్ట్‌తో కలిసి 1922లో జంతువుల నుంచి ఇన్సులిన్‌ను ఎలా తీయాలి, తీసిన ఇన్సులిన్‌ను ఎలా ఉపయోగించాలి అన్న విషయాన్ని సమాజానికి అందించారు. తీవ్రంగా పెరుగుతున్న మధుమేహ వ్యాధి గురించి ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించడానికి ఇంటర్నేషనల్ డయాబెటిస్ ఫెడరేషన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ కలిసి బెంటింగ్ జన్మదినమైన నవంబర్ 14వ తేదీని ప్రపంచ మధుమేహ దినోత్సవంగా ప్రకటించారు. ఈ కార్యక్రమం 1991 నుంచి కొనసాగుతున్నది.

ప్రపంచవ్యాప్తంగా డయాబెటిస్ కేసులు రోజురోజుకు తీవ్రంగా పెరుగుతూ ఉన్నాయి. ఈ సమస్య అంతకంతకూ పెరుగుతోంది. ప్రపంచంలో ప్రతి ఐదు సెక్లకు ఒకరు షుగర్ కారణంగా చనిపోతున్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 53.7 కోట్ల మందికి మధుమేహం ఉందని నాలుగు దశాబ్దాల కిందటితో పోలిస్తే ఈ సంఖ్య నాలుగు రెట్లకు పైగా పెరిగిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) ప్రకటించింది. అంటే ప్రపంచ జనాభాలో ప్రతి పది మందిలో ఒకరికి షుగర్ వ్యాధి ఉందని అర్థం చేసుకోవాలి. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఈ సంఖ్య 2030 నాటికి 64 కోట్ల మందికి, 2045 నాటికి 78 కోట్లకి పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. భారతదేశంలో కూడా మధుమేహుల సంఖ్య అదే విధంగా పెరుగుతూ వున్నది. మద్రాస్ డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ఇటీవల 2023 జూన్ నెలలో ప్రచురించిన అధ్యయనం ప్రకారం భారతదేశంలో మధుమేహుల సంఖ్య 10.1 కోట్లు. అంతేకాకుండా మరో 13.6 కోట్ల మంది ప్రజలు ప్రీ-డయాబెటిస్ దశల్లో ఉన్నారు. త్వరలో వీరు డయాబెటిస్ రోగులుగా మారిపోతారు. భారతదేశాన్ని "డయాబెటిస్ క్యాపిటల్ ఆఫ్ ది వరల్డ్" అని పిలుస్తారు, ఎందుకంటే ప్రపంచంలోని మొత్తం మధుమేహ రోగులలో 17 శాతం మంది భారతదేశంలో ఉన్నారు.

ఈ సంఖ్యలను బట్టి డయాబెటిస్ వ్యాధి ఎంత తీవ్రంగా విస్తరించబోతోందో అర్థం చేసుకోవచ్చు. ఇంటర్నేషనల్ డయాబెటిస్ ఫెడరేషన్ (ఐడిఎఫ్) విడుదల చేసిన సమాచారం ప్రకారం పాకిస్తాన్ జనాభాలో 31 శాతం మంది మధుమేహ వ్యాధితో జీవిస్తున్నారు. దేశ జనాభాలో ఎక్కువమందికి మధుమేహం ఉన్న దేశంగా పాకిస్తాన్ మొదటి స్థానంలో నిలిచింది.



> **ఎత్తుకు తగిన బరువు ఉండడం, పీచు పదార్థాలు ఎక్కువగా క్యాలరీలు తక్కువగా ఉన్న ఆహారాన్ని పరిమితంగా తీసుకోవడం, ఊబకాయం లేకుండా చూసుకోవడం, ధూమపానం-మద్యపానం లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండటం, ప్రతిరోజు శరీరం అలసిపోయే విధంగా కనీసం ఒక్క గంట పాటు వ్యాయామం చేయడం, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం, రోజుకు ఆరు గంటలు నిద్ర ఉండే విధంగా చూసుకోవడం లాంటి ఆరోగ్య నియమాలను పాటించగలిగితే వంశపారంపర్య చరిత్ర ఉన్నప్పటికీ షుగర్ వ్యాధి రాకుండా చూసుకోవచ్చు. అనివార్య పరిస్థితుల్లో వచ్చే అవకాశం ఉంటే కొంతకాలం పాటు షుగర్ వ్యాధి వచ్చే అవకాశాన్ని వెనక్కి నెట్టవచ్చు. ఈ ఆరోగ్య సూత్రాలను పాటించగలిగితే షుగర్ వ్యాధి వచ్చినా కానీ ... షుగర్ వ్యాధి వల్ల వచ్చే సమస్యలను చాలా వరకు నివారించవచ్చు.**

రక్తంలో చక్కెర స్థాయి సాధారణం కంటే ఎక్కువగా ఉండి టైప్-2 డయాబెటిస్‌గా పరిగణించేంత ఎక్కువగా లేకుండా ఉండే పరిస్థితిని "ప్రీ డయాబెటిస్" అంటారు. జీవనశైలిలో మార్పులు చేసుకోకపోయినా, ఊబకాయాన్ని పెంచుకున్నా, శారీరక శ్రమ తక్కువగా ఉన్నా ప్రీ-డయాబెటిస్ ఉన్నవారు మధుమేహ వ్యాధిగ్రస్తులుగా మారే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ప్రీ-డయాబెటిక్ ఎలా డయాబెటిక్‌గా మారతారో చెప్పలేము. "ప్రీ-డయాబెటిస్" ఉన్నవారిలో మూడింట ఒక వంతు మందికి కొన్ని సంవత్సరాలలో మధుమేహ వ్యాధిగ్రస్తులుగా మారే అవకాశం ఉంది. మరొక మూడవ వంతు మంది "ప్రీ-డయాబెటిక్స్"గానే కొనసాగవచ్చు. మిగిలిన మూడవ వంతు వారు ఆరోగ్యకరమైన ఆహారం, జీవనశైలి, వ్యాయామంతో "ప్రీ-డయాబెటిస్" దశ నుంచి వెనుకకు పోయి సాధారణ స్థితికి రావచ్చని చెన్నైకి చెందిన మధుమేహ వైద్య నిపుణులు, 'మోహన్ డయాబెటిస్ సెంటర్' డాక్టర్ వి.మోహన్ తెలుపుతున్నారు.

ఆధునిక కాలంలో జీవన శైలిలో చోటుచేసుకున్న మార్పులు, అధిక క్యాలరీలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం, శారీరక వ్యాయామం లేకపోవడం, ఒత్తిడి పెరగడం, ధూమపానానికి-మద్యపానానికి అలవాటు పడడం షుగర్ వ్యాధి ప్రబలడానికి ముఖ్యమైన కారణాలని అనేక అధ్యయనాలు తెలియజేస్తున్నాయి.

మధుమేహం ఉన్నవారిలో సుమారు సగం మందిలో వ్యాధి లక్షణాలు కనిపించవు. వ్యాధి లక్షణాలను గుర్తించి, రక్త పరీక్ష చేసి షుగర్ ఉంది అని డాక్టర్ చెప్పినా కొద్దిమంది రోగులు "మా వంశంలోనే ఎవరికీ లేదు షుగరు. నాకెలా వస్తుందండి..." అని వాదిస్తుంటారు. షుగర్ రోగులలో చాలామందికి వంశపారంపర్య చరిత్ర ఉండదు. వంశపారంపర్య చరిత్ర ఉన్నవారికి షుగర్ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగానే ఉంటుంది. తల్లిదండ్రులలో ఒకరికి షుగర్ వ్యాధి ఉంటే బిడ్డలకు షుగర్ వ్యాధి వచ్చే అవకాశం సుమారుగా 30 శాతం వరకు ఉంటుంది. తల్లిదండ్రులిద్దరికీ షుగర్ వ్యాధి ఉంటే బిడ్డలకు వచ్చే అవకాశం సుమారుగా 40 శాతం నుంచి 70 శాతం వరకు ఉంటుంది. వంశపారంపర్య షుగర్ చరిత్ర ఉండి, 30 సంవత్సరాల వయస్సు వచ్చిన వారందరూ ప్రతి సంవత్సరం రక్త పరీక్ష చేయించుకుని షుగర్ వ్యాధి వచ్చిందా లేదా అని నిర్ధారించుకోవడం అవసరం. ఇలా చేయగలిగితే షుగర్ వ్యాధిని ముందుగానే గుర్తించవచ్చు.

షుగర్ వ్యాధి రావడానికి వంశపారంపర్య చరిత్రతో పాటు ఎత్తుకు తగిన బరువు కంటే ఎక్కువ బరువు ఉండడం, ఊబకాయం ఉండడం, ఎక్కువ క్యాలరీలున్న ఆహారాన్ని తీసుకోవడం, ధూమపానం మద్యపానం లాంటి అలవాట్లు ఉండడం, శారీరక శ్రమ తక్కువగా ఉండడం, మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉండటం, శరీరానికి సరిపడా నిద్ర లేకపోవడం లాంటి కారణాలు అనేకం ఉన్నాయి. వంశపారంపర్య చరిత్ర ఉన్నప్పటికీ జీవన శైలిలో అనుకూల మార్పులను ఆచరించగలిగితే వ్యాధి వచ్చే అవకాశాన్ని కొంతకాలం రాకుండా చూసుకోవచ్చు.

మధుమేహం, రక్తపోటు తరచుగా సహజీవనం చేస్తుంటాయి. మధుమేహం ఉన్నవారికి రక్త పోటు వచ్చే అవకాశం ఎక్కువ. రక్తపోటు ఉన్నవారికి మధుమేహం వచ్చే అవకాశం ఎక్కువ. మధుమేహ వ్యాధిగ్రస్తులు కాని వారికంటే మధుమేహ వ్యాధిగ్రస్తులు రెండు రెట్లు అధిక రక్తపోటును కలిగి ఉంటారు. అధిక క్యాలరీల వినియోగంతో పాటు నిశ్చలమైన జీవనశైలి, ఇన్సులిన్ సున్నితత్వం, మధుమేహం వంటివి రక్తపోటుకు దారితీస్తాయి. మధుమేహ వ్యాధికి రక్తపోటు జతకడితే వచ్చే అనారోగ్య సమస్యలు సుమారు నాలుగు రెట్లు ఎక్కువగా ఉంటాయి. అందుకే షుగర్ ఉన్న ప్రతి వ్యక్తి తరచుగా రక్తపోటును కూడా పరీక్షించుకోవాలి. షుగర్ అదుపులో పెట్టుకోవడమే కాదు రక్తపోటును కూడా అదుపులో ఉంచుకోవాలి.

ఎత్తుకు తగిన బరువు ఉండడం, పీచు పదార్థాలు ఎక్కువగా క్యాలరీలు తక్కువగా ఉన్న ఆహారాన్ని పరిమితంగా తీసుకోవడం, ఊబకాయం లేకుండా చూసుకోవడం, ధూమపానం-మద్యపానం లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండటం, ప్రతిరోజు శరీరం అలసిపోయే విధంగా కనీసం ఒక్క గంట పాటు వ్యాయామం చేయడం, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం, రోజుకు ఆరు గంటలు నిద్ర ఉండే విధంగా చూసుకోవడం లాంటి ఆరోగ్య నియమాలను పాటించగలిగితే వంశపారంపర్య చరిత్ర ఉన్నప్పటికీ షుగర్ వ్యాధి రాకుండా చూసుకోవచ్చు. అనివార్య పరిస్థితుల్లో వచ్చే అవకాశం ఉంటే కొంతకాలం పాటు షుగర్ వ్యాధి వచ్చే అవకాశాన్ని వెనక్కి నెట్టవచ్చు. ఈ ఆరోగ్య సూత్రాలను పాటించగలిగితే షుగర్ వ్యాధి వచ్చినా కానీ షుగర్ వ్యాధి వల్ల వచ్చే సమస్యలను చాలా వరకు నివారించవచ్చు. షుగర్ వ్యాధి వంశపారంపర్య చరిత్ర ఉన్న ప్రతి ఒక్కరూ 35 సంవత్సరాలు నిండినప్పటి నుంచి ప్రతి సంవత్సరం షుగర్ పరీక్ష చేయించుకోవాలి. షుగర్ వంశపారంపర్య చరిత్ర లేని వారు 40 సంవత్సరాలు నిండినప్పటి నుంచి తప్పక ఏడాదికి ఒకసారి షుగర్ పరీక్ష చేయించుకోవాలి. ఇలా ప్రతి సంవత్సరం రక్త పరీక్ష చేయించుకుంటే షుగర్ వ్యాధిని దాదాపుగా నాలుగు సంవత్సరాల ముందుగానే గుర్తించవచ్చు.

(వ్యాసకర్త ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు)

★

కవిత్వం

స్వచ్ఛ రాజకీయాలు కావాలి!

వర్తమాన రాజకీయాలు మనకు
రోత పుడుతున్నాయి రోజురోజుకి ..!
ఈ రొంపి చెర లోకి రావాలంటే
కొత్తవారు కొంత భయపడుతున్నారు..!!
బట్టలు మార్చుకున్నంత సులువుగా
బడా నేతలు పార్టీలు మార్చుతున్నారు!
గుండీలు లాగినంత ఈజీగా
నాయకులు జెండాలను వీడుతున్నారు..!
ఆ రాజకీయ పార్టీల్లో....
ధనవంతులకూ బలవంతులకే సీట్లు ..!
సేవామూర్తులకు లేవు బెర్తులు
గుణవంతులకు లేవు పదవులు..!?
రకరకాల శక్తులతో నిండీ
నేటి రాజకీయాలు చెత్తకుండీలా మారి
యువతరాన్ని కంపు కొట్టిస్తున్నాయి..!
మేధో వర్గాలకు అసహ్యం పుట్టిస్తున్నాయి..!
సామాన్యుడి గోడును పేదవాడి గొంతును
చట్ట సభల్లో వినిపించి...చందన చర్చలు చేసే
స్వచ్ఛ రాజకీయాలు రావాలి...కావాలి ..!
ప్రజానేతలను ఎన్నుకునే తరుణం రావాలి...!

- జి. సూర్యనారాయణ, దివిసీమ.

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి.
పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళలకు ఏటా రూ. 15 వేలు

- భూపేశ్ బఘేల్

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో మహిళలకు ఏటా రూ 15 వేల ఆర్థిక సహాయం చేస్తామని ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ హామీ ఇచ్చారు. రాయ్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఈ హామీ ఇచ్చారు. బిజెపి తన మేనిఫెస్టోలో మహిళలకు ఏటా రూ.12 వేలు ఆర్థిక సహాయం అందిస్తామని వాగ్దానం చేసిన సంగతి తెలిసిందే. 'ఛత్తీస్‌గఢ్ గృహలక్ష్మి యోజన' కింద మహిళల బ్యాంక్ ఖాతాల్లోనే నేరుగా రూ.15 వేలు వేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో ఈ నెల 17న చివరి దశలో 70 స్థానాలకు పోలింగ్ జరగనుంది.

కరెంటోళ్ల సమస్యలు మ్యానిఫెస్టోలో చేర్చండి

- కాంగ్రెస్ మ్యానిఫెస్టో కమిటీకి టిఎస్‌యుఇఇయు వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

కాంగ్రెస్‌పార్టీ మ్యానిఫెస్టోలో కరెంటోళ్ల సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టిఎస్‌యుఇఇయు) కోరింది. ఈ మేరకు సోమవారం యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే ఈశ్వరరావు, వీ గోవర్ధన్, కంపెనీ కార్యదర్శి కే సత్యం, ప్రసాద్‌రాజు తదితరులు గాంధీభవన్‌లో కాంగ్రెస్ మ్యానిఫెస్టో కమిటీ సభ్యులు, టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు టీ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో దాదాపు 23వేల మంది ఆర్టిజన్లు పనిచేస్తున్నారనీ, వారందరినీ పర్మినెంట్ చేసినట్టు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించి, మోసం చేసిందని తెలిపారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఆర్టిజన్లను రెగ్యులరైజ్ చేస్తామనే హామీని ఇవ్వాలని యూనియన్ ప్రతినిధులు కోరారు. అలాగే విద్యుత్ పంపిణీ సంస్థల్లో (డిస్కంలు) దాదాపు 1,600 మంది అన్‌మేన్డ్ కార్మికులు పనిచేస్తున్నారనీ, వారిని ఆర్టిజన్లుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ప్రయివేటు బిల్‌కలెక్టర్లు, మీటర్ రీడర్లుగా దాదాపు 3,500 మంది పనిచేస్తున్నారనీ, వీరికి కనీస వేతనాలు ఇప్పించాలని కోరారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలనీ, అర్హులైన వారందరికీ పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న సర్వీసులకు అనుగుణంగా రిక్రూట్‌మెంట్లు చేస్తామనే హామీని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మురళి, సురేష్, మల్లేష్, మోహన్, వెంకటేశ్వర్లు, మున్నాలాల్ తదితరులు పాల్గొన్నారు.

'అవినీతి రాజధాని'గా మధ్యప్రదేశ్

భోపాల్ : మధ్యప్రదేశ్‌లో బిజెపి ప్రభుత్వం ఆ రాష్ట్రాన్ని 'అవినీతి రాజధాని'గా మార్చివేసిందని కాంగ్రెస్ నాయకులకు రాహుల్ గాంధీ ఆరోపించారు. రాష్ట్రంలోని నీముచ్ జిల్లాలోని జావద్‌లో సోమవారం జరిగిన ఎన్నికల బహిరంగ సభలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. బడా పారిశ్రామిక వేత్తలతో కుమ్మక్కయి బిజెపి ప్రభుత్వం మధ్యప్రదేశ్ ప్రజలను దోచుకుందని విమర్శించారు. ఇటీవల సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ కుమారుడి వీడియో గురించి కూడా రాహుల్ గాంధీ ప్రస్తావించారు. ఈ వీడియోలో తోమర్ కుమారుడు మీ డబ్బును దొంగిలిస్తున్నట్లు కనిపించిందని రాహుల్ తెలిపారు. 'మధ్యప్రదేశ్‌లోని బిజెపి ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా తక్కువ కాదు. రైతులు, కార్మికుల నుంచి డబ్బులు దోచుకోవడంలో తోమర్‌తో పోటీ పడుతున్నారు' అని రాహుల్ ఆరోపించారు. అదానీ వంటి పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించేందుకే నోట్ల రద్దు జరిగిందని, నోట్ల రద్దు చిన్న దుకాణాల యజమానులు, సామాన్య ప్రజలు తీవ్రంగా దెబ్బతీసిందని రాహుల్ తెలిపారు. మధ్యప్రదేశ్‌లో 500 ఫ్యాక్టరీలను స్థాపించామని బిజెపి ప్రభుత్వం 'బహిరంగంగా అబద్ధాలు' అడుతుందని, నీముచ్‌లో అలాంటి ఫ్యాక్టరీని ఒక్కటైనా చూశారా.. అని రాహుల్ ప్రజలను ప్రశ్నించారు. కేంద్రం, రాష్ట్రంలో అధికారంలోకి వస్తే కుల గణన నిర్వహిస్తామని రాహుల్ హామీ ఇచ్చారు. 230 మంది ఎమ్మెల్యేలు ఉన్న మధ్యప్రదేశ్‌లో ఈ నెల 17న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

రేపటి వరకు ఉపసంహరణ గడువు

- ప్రారంభమైన బుజ్జగింపుల పర్వం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా ఇప్పటికే నామినేషన్ల దాఖలు ముగిసిన విషయం తెలిసిందే. సోమవారం స్థానికంగా ఎక్కడిక్కడ రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల పరిశీలనను పూర్తిచేశారు. కొందరు అభ్యర్థులు నామినేషన్ పత్రాల్లో ఖాళీలు వదలడంతో వారికి సమాచారం ఇచ్చి, వాటిని భర్తీ చేయాలని కోరారు. మొత్తం 119 నియోజకవర్గాల్లో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ముగిసింది. దీనితో బుధవారం మధ్యాహ్నం 3 గంటలలోపు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. దీనితో రాజకీయపార్టీల్లో బుజ్జగింపుల పర్వం ప్రారంభమైంది. ఆయా పార్టీల్లో రెబల్ అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన వారిని ఉపసంహరించుకోవాలని ఆయా పార్టీల అధిష్టానాలు విజ్ఞప్తులు చేస్తున్నాయి. పార్టీల తరపున బీ ఫారమ్ తీసుకున్న అధికారిక అభ్యర్థులు కూడా తమ విజయానికి ఆటంకం కలుగుతుందని భావించే అభ్యర్థులను బుజ్జగించే పనిలో పడ్డారు. మరికొందరు ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా ఓట్లను చీల్చే అవకాశం ఉండటంతో కుల సమీకరణాలు, ఇతరత్రా అంశాలపై దృష్టిపెట్టి, సాధ్యమైనంత తక్కువ మంది పోటీలో ఉండేలా ప్రధాన పార్టీల అభ్యర్థులు వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తున్నారు. మొత్తం 119 నియోజకవర్గాల్లో 4,798 నామినేషన్‌లు దాఖలైన విషయం తెలిసిందే. నామినేషన్ల ఉపసంహరణ తర్వాతే ఏ నియోజకవర్గంలో ఎంతమంది అభ్యర్థులు పోటీలో ఉంటారో స్పష్టంగా తేలనుంది. అలాగే ఈనెల 30న పోలింగ్, డిసెంబర్ 3వ తేదీ ఫలితాలు వెల్లడవుతాయి.

సిపిఎం కేంద్ర కార్యాలయాన్ని సందర్శించిన వియత్నాం బృందం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేరళకు మరిన్ని రంగాల్లో సహకరించాలని వియత్నాం తన ఆకాంక్షను వ్యక్తం చేసింది. వియత్నాంలోని విన్‌లాంగ్ ప్రావిన్స్ ముఖ్యమంత్రి, వియత్నాం కమ్యూనిస్ట్ పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు బుయ్ వాన్ ఘిమ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితో జరిగిన సమావేశంలో తమ ఆసక్తిని వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల బృందానికి సోమవారం నాడిక్కడ సిపిఎం కేంద్ర కార్యాలయం (ఎకెజి భవన్)లో స్వాగతం పలికింది. ద్వైపాక్షిక సంబంధాలకు అతీతంగా ప్రజలు, వియత్నాం పార్టీతో తనకు భావోద్వేగ బంధం ఉందని బుయ్ వాన్ ఘిమ్‌కు ఏచూరి తెలియజేశారు.

తన తొలి భారత పర్యటనలో భాగంగా ఆయన సిపిఎం ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. విన్‌లాంగ్, దక్షిణ వియత్నాం ప్రావిన్స్, కేరళతో సహకారం గురించి కూడా చర్చించారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంపైనా నేతలు చర్చించారు. ఏచూరితోపాటు, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబీ, నీలోత్పల్ బసు, కేంద్ర కమిటీ సభ్యుడు మురళీధరన్‌తో పాటు భారతదేశంలోని వియత్నాం రాయబారి గుయెన్ థాన్ హై కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. భారత్-వియత్నాం వ్యూహాత్మక ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో భాగంగా ఈ పర్యటన 16 వరకు జరగనుంది. గత నెలలో వియత్నాం రాజధాని హోచిమిన్ సిటీకి కొచ్చి నుండి డైరెక్ట్ ఫ్లైట్ సర్వీస్ ప్రారంభించిన తర్వాత మరిన్ని రంగాల్లో సహకారం కోసం వియత్నాం సంసిద్ధత వ్యక్తం చేసింది. ఇది పర్యాటక రంగానికి ఊతం ఇచ్చింది.

కేరళకు బకాయిలు చెల్లింపుల్లో జాప్యం : బాలగోపాల్

కొచ్చి : సాంకేతిక కారణాలను సాకుగా చూపుతూ కేంద్ర ప్రభుత్వం కేరళకు బకాయిలు చెల్లించడంలో జాప్యం చేస్తోందని ఆ రాష్ట్ర ఆర్థిక మంత్రి కెఎన్ బాలగోపాల్ విమర్శించారు. కేరళ ప్రభుత్వం ఇప్పటికే ఖర్చు చేసిన దానితోపాటు ఇతర బకాయిలలో కొంత భాగాన్ని రాష్ట్రానికి కేంద్రం చెల్లించాల్సి ఉందని మంత్రి తెలిపారు. ఈ విధంగా చెల్లింపుల తిరస్కరణ కేంద్ర-రాష్ట్ర సంబంధాల స్ఫూర్తికి విఘాతమని అన్నారు. మంగళవారం కొచ్చిలో విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం, కేంద్రం మధ్య సంబంధాలను బానిస-యజమాని బంధంగా నిర్బంధించకూడదని అన్నారు. .సాంఘిక సంక్షేమ పెన్షన్‌తో సహ కొన్ని బకాయి చెల్లింపులను మాత్రమే కేంద్రం చేసిందని మంత్రి తెలిపారు. ఫైనాన్స్ కమిషన్ కేటాయింపు రేటు 3.9 శాతం నుంచి ఇప్పుడు 1.9 శాతానికి తగ్గిందని మంత్రి చెప్పారు.

'ఉచితాల'పై బిజెపి హామీల వరద

- అదే బాటలో కాంగ్రెస్
- హిందూత్వ పాచిక వేస్తున్న కమలదళం
- దిగజారుతున్న మధ్యప్రదేశ్ ఆర్థిక పరిస్థితి

భోపాల్ : మధ్యప్రదేశ్ రాష్ట్రం నెత్తిన రుణభారం పెరిగిపోతుంటే వాస్తవ పరిస్థితిని దాచిపెట్టి, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు బిజెపి తన ఎన్నికల ప్రణాళికలో హామీల వరద పారించింది. రాష్ట్ర శాసనసభ ఎన్నికల కోసం బిజెపి రెండు రోజుల క్రితం మేనిఫెస్టో విడుదల చేసింది. రాష్ట్రంలోని పేద కుటుంబాలన్నింటికీ ఉచిత రేషన్ అందజేయడంతోపాటు అందుబాటులో ఉన్న మేరకు పప్పులు, ఆవనూనె, పంచదారను కూడా సబ్సిడీ రేట్లపై విక్రయిస్తామని ప్రకటించింది. ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులకు పన్నెండో తరగతి వరకూ ఉచితంగా విద్యను అందిస్తామని తెలిపింది. ఈ హామీలతో పాటు ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పలు ప్రకటనలు చేశారు. రాష్ట్రంలోని 30 లక్షల మంది జూనియర్ స్థాయి ఉద్యోగులకు వేతనాలు, అలవెన్సులు పెంచుతామని, అంగన్‌వాడీ కార్యకర్తల జీతాలను కూడా రూ.13 వేలకు పెంచుతామని, రోజ్‌గార్ సహాయకుల గౌరవ వేతనాన్ని రెట్టింపు చేస్తామని ఆయన చెప్పారు. జిల్లా పంచాయతీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఉప సర్పంచ్‌లు వంటి నేతల గౌరవ వేతనాన్ని మూడు రెట్లు పెంచుతామని తెలిపారు. మైనారిటీ విద్యార్థులకు రూ.135 కోట్ల ఖర్చుతో ఈ-స్కూటర్లు అందజేస్తామని, రూ.196 కోట్ల వ్యయంతో 78 వేల మంది విద్యార్థులకు లాప్‌టాప్‌లు ఇస్తామని చెప్పారు. వీటన్నింటికీ అవసరమైన నిధులు ఎక్కడి నుండి సమకూరుస్తారో మాత్రం ఆయన చెప్పలేదు. అటు ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా ఉచితాలపై హామీల వరద పారిస్తోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత పాలకులు పన్ను చెల్లింపుదారుల సొమ్మును ఉచితాల కోసం పందారం చేస్తారని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

పోటాపోటీ హామీలు

రాష్ట్ర బడ్జెట్ పరిమాణం రూ.3.14 లక్షల కోట్లు. మరోవైపు రాష్ట్రం నెత్తిన ఉన్న అప్పు అక్షరాలా రూ.3.50 లక్షల కోట్లు. గత ఆరు నెలల కాలంలో శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రభుత్వం ఏకంగా పది వేల కోట్ల రూపాయల అప్పు తీసుకుంది. జనాకర్షక హామీలు గుప్పించే విషయంలో బిజెపి, కాంగ్రెస్ పోటీ పడుతున్నాయి.

చౌహాన్ ప్రభుత్వం రాష్ట్రంలోని మహిళల కోసం లడ్లీ బెహనా యోజన పథకాన్ని ప్రారంభించింది. దీనికి పోటీగా కాంగ్రెస్ పార్టీ నారీ సమ్మాన్ యోజన పథకాన్ని ప్రకటించి మహిళలకు ప్రతి నెలా రూ.1,500 ఇస్తానని హామీ ఇచ్చింది. చౌహాన్ తక్కువ తిన్నారా? లడ్లీ బెహనా పథకం కింద మహిళలకు ఇస్తున్న రూ.1,500ను రూ.2,500కు పెంచారు. ఇప్పుడు ఆ మొత్తాన్ని ఏకంగా మూడు వేలకు పెంచుతామని ఆయన హామీ ఇచ్చారు.

ఉచితాలపై కాంగ్రెస్ కూడా ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. రూ.500కే గ్యాస్ సిలిండర్, వంద యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, సగం రేటుకే 200 యూనిట్ల వరకూ కరెంట్ వంటి హామీలు కురిపించింది. ఆవు పేడ పథకం విజయవంతం కావడంతో కిలో ఆవు పేడను రెండు రూపాయలకు కొనుగోలు చేస్తానని తెలిపింది. బియ్యం, గోధుమలకు కాంగ్రెస్ పార్టీ కనీస మద్దతు ధరలు ప్రకటించగానే బిజెపి తానేం తక్కువ తినలేదన్నట్లు ఆ మొత్తాన్ని పెంచింది.

ఆలయాల నిర్మాణం కోసం నిధులు

ఉచితాలతో ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేయడంతో పాటు అధికార బిజెపి హిందూత్వ వాదనను మరింత ముందుకు తెస్తోంది. రాష్ట్రంలో నాలుగు ఆలయాల ఏర్పాటు కోసం బిజెపి ప్రభుత్వం రూ.358 కోట్లు కేటాయించింది. సాగర్‌లోని రవిదాస్ ఆలయానికి ప్రధాని నరేంద్ర మోడీ ఆగస్టులో భూమిపూజ కూడా చేశారు. ఈ ఆలయాన్ని రూ.100 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. చింద్వారాలో పురాతన హనుమాన్ దేవాలయాన్ని ఆధునీకరించేందుకు చౌహాన్ ప్రభుత్వం రూ.350 కోట్ల నిధులను ప్రకటించింది.

టన్నెల్‌లోనే 40 మంది కార్మికులు

- వెలికితీతకు రెండు, మూడు రోజులు
- ఉత్తరకాశీ ఘటనపై అధికారులు

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లో సొరంగం కూలిన ఘటనలో కార్మికులు క్షేమంగానే ఉన్నారు. వారికి నీరు, ఆహారం అందజేస్తున్నట్టు అధికారులు తెలిపారు. అయితే, చిక్కుకున్న కార్మికులను రక్షించటం కోసం సహాయ చర్యలకు మరో రెండు రోజులు పట్టవచ్చని చెప్పారు. బ్రహ్మఖాల్-యమునోత్రిపై సిల్క్యారా, దండల్‌గావ్ మధ్య చార్‌దామ్ మార్గంలో నిర్మాణంలో ఉన్న సొరంగం ఆదివారం తెల్లవారుజామున కూలి 40 మంది కార్మికులు చిక్కుకున్న ఘటన తెలిసిందే. అయితే, చిక్కుకుపోయిన కార్మికులంతా క్షేమమేననీ, వారితో కమ్యూనికేషన్ జరుపుతున్నట్టు అధికారులు వివరించారని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి తెలిపారు. ఘటనా ప్రాంతాన్ని ఆయన సందర్శించారు.

ఆదివారం ఘటన జరిగిన అనంతరం సహాయక చర్యలను మొదలు పెట్టిన తక్షణమే చిక్కుకున్న కార్మికులకు ఆక్సిజన్‌ను అందించారు. అయితే, ఆదివారం అర్ధరాత్రి కార్మికులతో కమ్యూనికేషన్ ఏర్పడిన తర్వాత వారికి తాగటానికి నీరు, తేలికపాటి ఆహారాన్ని అందించినట్టు అధికారులు వివరించారు. మంగళవారం రాత్రికి లేదా బుధవారం నాటికి కార్మికులను బయటకు తీసే అవకాశం ఉన్నదని ఘటనా ప్రాంతాన్ని సందర్శించిన సెక్రెటరీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రంజిత్ కుమార్ సిన్హా వెల్లడించారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వ రంగ సంస్థ
ఉయ్యూరు బ్రాంచి (0611)
వెటర్నరీ హాస్పిటల్ ప్రక్కన, ఉయ్యూరు, కృష్ణా జిల్లా, ఎపి - 521165

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఉయ్యూరు బ్రాంచి అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టం నందలి రూలు 8(6) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీతలకు నోటీసు ఇచ్చి తెలియజేయునదిఏమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించిన విధముగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించడమైనది. దిగువ స్థిరాస్తి **అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది"** ప్రాతిపదిన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతల నుండి రావలసిన **బకాయి మొత్తము రూ. 26,35,643/-** (అక్షరాలా ఇరవై ఆరు లక్షల ముప్పై ఐదు వేల ఆరు వందల నలభై మూడు రూపాయలు మాత్రమే) మరియు వడ్డీ, ఇతర ఖర్చులు రాబట్టుకొనేందుకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఉయ్యూరు బ్రాంచి వారిచే** ఇ-వేలం అమ్మకం ద్వారా **ది. 29-11-2023న** ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. **బిడ్లు సమర్పించుటకు ఆఖరుతేదీ :** ఈ-వేలం ప్రారంభానికి ముందు వరకు

ఋణగ్రహీతల వివరములు : 1) శ్రీమతి పక్కల శాంతి, హెచ్.నెం. 6-128, శయన హోమ్స్ (సత్య లలిత నివాస్), 1వ అంతస్తు, ఫ్లాట్ నెం. ఎఫ్ 2, గండిగుంట, ఉయ్యూరు - 521165, కృష్ణా జిల్లా, ఎపి. **2) శ్రీ పక్కల సోమశేఖర్, శాంతి,** హెచ్.నెం. 6-128, శయన హోమ్స్ (సత్య లలిత నివాస్), 1వ అంతస్తు, ఫ్లాట్ నెం. ఎఫ్ 2, గండిగుంట, ఉయ్యూరు - 521165, కృష్ణా జిల్లా, ఎపి.

ఆస్తి వివరములు :

శ్రీమతి పక్కల శాంతి, భర్త : సోమశేఖర్ గారి పేరిట కృష్ణా జిల్లా, ఉయ్యూరు నగర పంచాయితీ, గండిగుంట గ్రామం, 6వ వార్డు, దగ్గరి ఇంటి నెం. 6-128, ఆర్.ఎస్.నెం. 271/1 & 2 మొత్తం 336.9 చ॥గ॥లలోని అవిభక్త వాటా 48.13 చ॥గ॥లతో కలిపి 1224 చ॥అ॥ల విస్తీర్ణంగల ఫ్లింత్ ఏరియాతో శయన హోమ్స్ (సత్య లలిత నివాస్) నందు ఫస్ట్ ఫ్లోర్ నందు గల రెసిడెన్షియల్ ఫ్లాట్ ఎఫ్-2. ఫ్లాట్‌కి **హద్దులు : తూర్పు :** శూన్యాకాశము, **దక్షిణం :** శూన్యాకాశము, **ఉత్తరం :** శూన్యాకాశము, **పడమర :** కామన్ పాసేజ్ మరియు మెట్లు.

రిజర్వుధర (రూ.) : 27,00,000/- ధరావత్తు ధర (రూ.) : రూ. 2,70,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం **https://www.ibapi.in మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్ : www.unionbankofindia.co.in** నందు చూడగలరు. అధీకృత అధికారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం పైన పేర్కొన్న తేది నందు బ్రాంచి హెడ్ మొబైల్ నెం. **93818 72086,** బ్రాంచి **Mail ID : bm0806111@unionbankofindia.bank**లలో సంప్రదించవచ్చు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం నోటీసు

చెల్లించవలసిన బకాయిలను పూర్తిగా చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదీన ఈ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీత / సహాబాధ్యతగల వారికి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని 8(6) రూలు 9(1) క్రింద దీనిని నోటీసుగా పరిగణించవలెను.

తేది : 09-11-2023
ప్రదేశం : ఉయ్యూరు
సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన శ్రీలంక అధ్యక్షుడు

కొలంబో : శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘె సోమవారం తమ ప్రభుత్వ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. నగదు సంక్షోభంతో ఇబ్బంది పడుతున్న దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కోలుకోవాలంటే మరింత కఠినమైన సంస్కరణలు అవసరమని ఆయన అన్నారు. ప్రస్తుత సమయంలో అధిక ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ ఇంకా పూర్తిగా కోలుకోలేదని అన్నారు. గతేడాది సెప్టెంబరులో 70శాతంగా వున్న ద్రవ్యోల్బణం ఈ ఏడాది అక్టోబరుకు 1.5శాతానికి కుదించామని చెప్పారు. మరోసారి దివాళా తీయకుండా వుండాలంటే కఠినమైన సంస్కరణలు అనివార్యమని స్పష్టం చేశారు. 13లక్షల మంది ఉద్యోగులకు, ఏడు లక్షల మంది పెన్షనర్లకు జీవన వ్యయ అలవెన్సులను వచ్చే ఏడాది నుండి వరుసగా రూ.10వేలు, రూ.3వేలు పెంచనున్నట్లు విక్రమసింఘె తెలిపారు. 2024 సంవత్సరానికి ప్రకటించే ఈ బడ్జెట్ ఎన్నికల బడ్జెట్ కాదని, ఎలాంటి ప్రజాకర్షక విధానాలు వుండవని తెలిపారు. వచ్చే ఏడాది నవంబరులోగా అధ్యక్ష ఎన్నికలు నిర్వహించాల్సి వుంది.

9 మెయితీ సంస్థల నిషేధం

- కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఉత్తర్వులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వేర్పాటువాద, విధ్వంసకర, తీవ్రవాద, హింసాత్మక కార్యకలాపాలను అరికట్టడానికి చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యుఎపిఎ) కింద తొమ్మిది 'మెయితీ' సంస్థలను 'చట్టవిరుద్ధమైన సంఘాలు'గా కేంద్రప్రభుత్వం ప్రకటించింది. సోమవారం నుంచి ఆయా సంఘాలపై ఐదేళ్లపాటు నిషేధం విధిస్తూ కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం, 1967లోని సెక్షన్ 3లోని సబ్-సెక్షన్ (1) ద్వారా అందించబడిన అధికారాలను ఉపయోగించి, కేంద్ర ప్రభుత్వం మెయితీ తీవ్రవాద సంస్థలను ప్రకటించింది. అవి పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్‌ఎ), దాని రాజకీయ విభాగం, రివల్యూషనరీ పీపుల్స్ ఫ్రంట్ (ఆర్‌పిఎఫ్), యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ (యుఎన్‌ఎల్‌ఎఫ్), దాని సాయుధ విభాగం, మణిపూర్ పీపుల్స్ ఆర్మీ (ఎంపిఎ), పీపుల్స్ రివల్యూషనరీ పార్టీ ఆఫ్ కాంగ్లీపాక్, దాని సాయుధ విభాగం 'రెడ్ ఆర్మీ', కంగ్లీపాక్ కమ్యూనిస్ట్ పార్టీ (కెసిపి), దాని సాయుధ విభాగం 'రెడ్ ఆర్మీ', కంగ్లీ యావోల్ కాన్బలుప్ (కెవైకెఎల్), కో-ఆర్డినేషన్ కమిటీ, సోషలిస్ట్ కోసం అలయన్స్ యూనిటీ కంగ్లీపాక్‌తోపాటు వారి అన్ని వింగ్‌లు, ఫ్రంట్ ఆర్గనైజేషన్‌లు' చట్టవిరుద్ధమైన సంఘాలుగా ఉన్నాయని నోటిఫికేషన్‌లో పేర్కొంది. మణిపూర్‌లో మే 3 నుండి ఈశాన్య రాష్ట్రంలో ఆధిపత్య మెయితీ, గిరిజన కుకీల మధ్య జాతి హింస చెలరేగడంతో కనీసం 178 మంది మరణించారు. 50,000 మంది నిరాశ్రయులయ్యారు.

15వ తేదీ సాయంత్రానికల్లా ఎలక్టోరల్ బాండ్ల వివరాలు తెలపండి

- రాజకీయ పార్టీలకు ఇసి లేఖలు

న్యూఢిల్లీ : ఎలక్టోరల్ బాండ్ల ద్వారా విరాళం అందుకున్న పార్టీలు ఆ వివరాలను నవంబర్ 15 లోపు తమకు అందించాలని ఎన్నికల సంఘం కోరింది. ఎలక్టోరల్ బాండ్లు ప్రవేశపెట్టినప్పటి నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలు స్వీకరించిన నిధుల వివరాలను సీల్డ్ కవర్‌లో తమకు సమర్పించాలని నవంబర్ 2న సుప్రీంకోర్టు ఎన్నికల సంఘాన్ని ఆదేశించిన తరువాత నిర్వచనా సదన్‌లో కదలిక వచ్చింది.

నవంబర్ 3న అన్ని రాజకీయ పార్టీల అధినేతలకు లేఖలు రాస్తూ, ప్రతి బాండ్‌పై దాతల వివరణాత్మక వివరాలు, బాండ్ల ద్వారా ఎంత మొత్తం స్వీకరించారు వంటి వివరాలను డబుల్ సీల్డ్ కవర్‌లో పంపాలని ఇసి కోరింది. వీటిని ఈ నెల15వతేదీ సాయంత్రానికల్లా ఎన్నికల వ్యయ విభాగం కార్యదర్శికి అందేలా పంపాలని కోరింది. సుప్రీం కోర్టు నవంబర్ 2న జారీ చేసిన ఉత్తర్వులో "ఈ కసరత్తు నవంబర్ 19 లేదా అంతకు ముందే పూర్తి చేయాలని ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 2019 ఏప్రిల్ 12న జారీ చేసిన మధ్యంతర ఆదేశాలను ప్రస్తావించింది. దేశంలో ఎన్నికల ప్రక్రియ పవిత్రతపై". జనవరి 2, 2018న ప్రభుత్వం నోటిఫై చేసిన ఎలక్టోరల్ బాండ్ల పథకం, రాజకీయ నిధులలో పారదర్శకతకు పాతరేసేలా ఉందని విమర్శలు వచ్చాయి. పథకంలోని నిబంధనల ప్రకారం, ఎలక్టోరల్ బాండ్లను భారతదేశంలోని ఏ పౌరుడైనా లేదా దేశంలో విలీనం చేయబడిన విదేశీ సంస్థ కొనుగోలు చేయవచ్చు. ఒక వ్యక్తి ఒంటరిగా లేదా ఇతర వ్యక్తులతో కలిసి ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేయవచ్చు.

ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 29ఎ కింద నమోదైన రాజకీయ పార్టీలు మాత్రమే ఎలక్టోరల్ బాండ్లను స్వీకరించడానికి అర్హులు. ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం, ఎలక్టోరల్ బాండ్‌లను అర్హత కలిగిన రాజకీయ పార్టీ అధీకత బ్యాంకు ఖాతా ద్వారా మాత్రమే క్యాష్ చేసుకోవాలి ఎలక్టోరల్ బాండ్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సిపిఐ(ఎం) మినహా మిగతా రాజకీయ పార్టీలన్నీ ఈ ఎలక్టోరల్ బాండ్లను స్వీకరిస్తున్నాయి.

పాలస్తీనాకు సంఘీభావంగా లండన్‌లో 8 లక్షల మందితో భారీ మార్చ్

లండన్: బ్రిటీష్ చరిత్రలో అతిపెద్ద రాజకీయ కవాతుల్లో ఒకటి శనివారం లండన్‌లో జరిగిన మార్చ్. దీనిలో 800,000 మందికిపైగా ప్రజలు పాల్గొన్నారు.లండన్ నగరం దాదాపు స్తంభించి పోయింది. గాజాపై ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న బాంబు దాడులకు వ్యతిరేకంగా శాంతియుత నిరసనతెలిపేందుకు గత అయిదు వారాలుగా బ్రిటన్ ప్రజలు వారాంతపు ర్యాలీలు నిర్వహి స్తున్నారు. గాజాలోని అతిపెద్ద ఆసుపత్రిని ఇజ్రాయెల్ భూ బలగాలు మూసివేస్తున్నందున ప్రభుత్వం వెంటనే కాల్పుల విరమణకు పిలుపు నివ్వాలని నిరసనకారులు డిమాండ్ చేశారు.పౌరులు ప్రస్తుతం కాంప్లెక్స్‌లో ఆశ్రయం, చికిత్స పొందుతున్నారు, "భూమిపై నరకం"గా గాజాను ఇజ్రాయిల్ మార్చింది. 'ఇజ్రాయెల్ యొక్క విచక్షణారహిత బాంబు దాడిలో ఇప్పటికే 11,000 మంది పాలస్తీనియన్లు మరణించారు, వీరిలో దాదాపు 5,000 మంది పిల్లలు తప్పిపోయారు, వారి స్వంత ఇళ్ల శిథిలాల కింద మరణించినట్లు భావించారు," అని నిరసనను నిర్వహించడానికి సహాయపడిన పాలస్తీనా సాలిడారిటీ క్యాంపెయిన్ డైరెక్టర్ బెన్ జమాల్ అన్నారు.

లండన్‌లో లక్షలాది మందితో శనివారం జరిగిన భారీ కవాతు

తృణమూల్ రౌడీ మూకల దాడులు

- సిపిఐ(ఎం) మద్దతుదారుల ఇళ్లకు నిప్పు

జాయ్ నగర్: "పోలీసుల ఎదుటే తృణమూల్‌కి చెందిన రౌడీ మూకలు సిపిఐ(ఎం) మద్దతుదారుల ఇళ్లను తగులబెట్టాయి. మంటలను ఆర్పేందుకు ఫైర్ ఇంజన్ వచ్చినప్పుడు తృణమూల్ వారు రోడ్డును అడ్డుకున్నారు" అని జయనగర్‌లో తృణమూల్ నాయకుడి మరణం తరువాత దాలు అఖంకి గ్రామంపై ఈ మూకలు దాడి చేసి ఇళ్లకు నిప్పుపెట్టారని ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. బమంగాచ్చి పంచాయతీ సభ్యుడు, తృణమూల్ అధ్యక్షుడు సైఫుద్దీన్ లస్కర్ సోమవారం ఉదయం తన ఇంటికి 100 మీటర్ల దూరంలోని మసీదు వద్ద ప్రార్థనలు చేసేందుకు వెళుతుండగా ఆ సమయంలో మసీదు ముఖద్వారం వద్ద బైక్‌లపై వచ్చిన కొందరు అతడిని చుట్టుముట్టారు. ఈ ఘటనకు పాల్పడిన వారిలో ఒకరిని అక్కడే పట్టుకుని కొట్టి చంపారు. పట్టుబడిన వ్యక్తి జయనగర్‌కు చెందిన వ్యక్తి కాదు. బయటి నుంచి వచ్చిన వ్యక్తి అని అనుమానిస్తున్నారు.

"ఈ ఘటన తెలియగానే మా గ్రామంపై దుష్టశక్తుల గుంపు హఠాత్తుగా దాడి చేసింది. తగులబెట్టిన ఇళ్లన్నీ అట్టడుగు వర్గాలకు చెందినవారివే.

48గంటల్లో గాజాలో స్తంభించనున్న కమ్యూనికేషన్ వ్యవస్థ ?

- సహాయ చర్యలు నిలిచిపోతాయన్న ఐరాస
- సంక్షోభం మరింత ముదురుతోందంటూ ఐక్యరాజ్య సమితి ఆందోళన

గాజా, జెరూసలేం, న్యూయార్క్ : గాజాలో కొనసాగుతున్న యుద్ధంలో ఇప్పటివరకు 101 మంది ఐక్యరాజ్య సమితి సిబ్బంది మరణించారు. వారి మృతికి సంతాప సూచకంగా ఆసియా దేశాల వ్యాప్తంగా ఐక్యరాజ్య సమితి పతాకాలు సగానికి కిందకు దింపి సంతాపం వ్యక్తం చేశారు. మరోపక్క ఇంధన నిల్వలు హరించుకుపోయి విద్యుత్ కొరత ఏర్పడడంతో ఆస్పత్రుల్లో పరిస్థితులు అత్యంత దయనీయంగా మారుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అదనామ్ గెబ్రియెసెస్ హెచ్చరించారు. నవజాత శిశువులతో సహా అనేకమంది రోగులు మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గాజాలో జరుగుతున్నదానికి నరమేథం అన్న పదం కూడా చిన్నదే అవుతుందని అల్-అహ్లి ఆస్పత్రి డైరెక్టర్ వ్యాఖ్యానించారు. ఇంధన కొరత కారణంగా గాజాలో వచ్చే 48గంటల్లో మానవతా సహాయక చర్యలు కూడా నిలిచిపోతాయని ఐక్యరాజ్య సమితి సహాయ చర్యల కమిషనర్ థామస్ వైట్ హెచ్చరించారు. విద్యుత్ లేకపోవడంతో గాజాలో కమ్యూనికేషన్ వ్యవస్థలన్నీ పూర్తిగా స్తంభించిపోతాయని పాలస్తీనా టెలికం మంత్రి ప్రకటించారు. అదే గనుక జరిగితే పేరా మెడికల్ బృందాలెవరూ అటూ ఇటూ కదలడానికి కూడా లేకుండా పోతుందని, దీనివల్ల సంక్షోభం మరింత ముదురుతుందని వైట్ హెచ్చరించారు.

పెద్ద సంఖ్యలో ప్రజల ఆచూకీ గల్లంతవుతోందని, వీరిలో చాలా మంది శిధిలాల కింద చిక్కుకుపోయి ఉంటారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. అటువంటి వారి సంఖ్య 3,200కి పైనే వుందని, వీరిలో 1700మంది వరకు చిన్నారులే వుంటారని తెలిపింది. వీరికి అత్యవసర వైద్య చికిత్స అవసరమవుతోందని, కానీ వీరివద్దకు అంబులెన్సులు లేదా పౌర రక్షణ బలగాలు ఏవీ చేరే అవకాశం కూడా లేదని తెలిపింది. గత నెల రోజుల పైనుండి పాఠశాలలు మూతపడ్డాయి. అంతర్గత నిర్వాసితల కోసం స్కూళ్లను ఆశ్రయాలుగా మార్చారు. మరోవైపు లెబనాన్‌లోని హిజ్బుల్లా స్థావరాలపై అనేక దాడులు చేపట్టినట్లు ఇజ్రాయిల్ వైమానిక బలగాలు తెలిపాయి. తాము కూడా ఇజ్రాయిల్ బలగాలపై యుద్ధ ట్యాంక్ విధ్వంసక క్షిపణులను ఉపయోగించి దాడులు జరిపినట్లు హిజ్బుల్లా తెలిపింది. కొంతమంది మరణించారని వెల్లడించింది. దీనిపై ఇజ్రాయిల్ మిలటరీ వెంటనే వ్యాఖ్యానించలేదు.

ఫారం నెం.14 (రెగ్యులేషన్ 33(2) చూడవలెను)

రికవరీ ఆఫీసర్ వారి కార్యాలయం-I
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్
(ఆర్థిక సేవల విభాగం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వము)
31-31-21, నారాయణ భవనం, సాయి బాబా వీధి, డాబా గార్డెన్స్, విశాఖపట్నం - 530020.

డిమాండ్ నోటీసు

అప్పులు & దివాలా చట్టం 1993 నందలి రికవరీ సెక్షన్ 25 నుండి 28 వరకు మరియు ఆదాయపు పన్ను చట్టం 1961 నందలి రెండవ షెడ్యూలు 2వ నియమము ప్రకారం

RC/651/2017 27.10.2023

ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, గాంధీ నగర్ బ్రాంచ్, విజయవాడ
వర్సెస్
శ్రీ షేక్ మబు సుభాన్ & ఇతరులు

దిగువ వారికి
(సిడి-1) **శ్రీ షేక్ మబు సుభాన్, తండ్రి. షేక్ మస్తాన్ వలీ,** డి.నెం.4-112, ఈడుపుగల్లు, కంకిపాడు మండలం, కృష్ణా జిల్లా.
(సిడి-2) **శ్రీ హనుమనుల వెంకట సురేష్ కుమార్, తండ్రి. రామకోటయ్య,** డి.నెం.48-12-16, ఇ.ఎస్.ఐ బస్టాప్, గుణదల, విజయవాడ.

జారీ చేయబడిన రికవరీ సర్టిఫికేట్ దృష్ట్యా గౌరవనీయ ప్రెసిడింగ్ అధికారి, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం ద్వారా **తేది.16.11.2017** నందు **O.A. No. 519 of 2015** ఆమోదించబడింది. మొత్తం **రూ.60,03,065/- (అక్షరాల అరవై లక్షల మూడు వేల అరవై ఐదు రూపాయలు మాత్రమే)** కలిపి పెండెంటెలైట్ మరియు భవిష్య వడ్డీ @ 13.25% పైన పేర్కొన్న మొత్తంపై అర్థ సంవత్సరానికి **తేది.04.08.2015** నుండి రియలైజ్ అయ్యే వరకు / **రూ.1,01,500/- (అక్షరాల ఒక లక్ష ఒక వెయ్యి ఐదు వందల రూపాయలు మాత్రమే)** ఖర్చులతో చెల్లింపు తేదీ వరకు చెల్లించాల్సి ఉంటుంది. (పూర్తిగా / పరిమితంగా)

2. మీరు ఈ నోటీసు అందుకున్న తేది నుండి 15 రోజుల లోపు మొత్తం చెల్లించవలసి ఉంటుంది. లేని యెడల "బ్యాంకు మరియు ఆర్థిక సంస్థల" చట్టం ప్రకారం ఋణాల రికవరీలోని 1993 నియమము ప్రకారం వసూలు చేయబడుతుందని ఆదేశించడమైనది.
3. దీని ప్రకారము మీరు కలిగియున్న ఆస్తుల మొత్తం వివరాలను అఫిడవిట్‌లో ప్రకటించాలని ఆదేశించడమైనది.
4. పై ఆదేశానుసారం, **తేది.04.12.2023 ఉదయం గం.10.30 ని.లకు** తదుపరి చర్యలు నిమిత్తం ఆదేశించిన అధికారి వారి ముందు హాజరవ్వాలని ఆదేశించడమైనది.
5. పైన పేర్కొన్న మొత్తానికి అదనంగా మీరు నిబంధనల ప్రకారం ఈ క్రింది విధంగా చెల్లించవలసి ఉంటుంది.
   ఎ) ప్రొసీడింగ్ ప్రకారం జారీ చేయబడిన నోటీసు తేది తరువాత నుండి అయ్యే ఖర్చులు గాని, విధించబడే వడ్డీలు గానిన అదనంగా వసూలు చేయబడుతుంది.
   బి) ఈ నోటీసు తయారీ, వారంట్ పంపుట (విడుదల) మరియు ఇతర సేవా ప్రక్రియలకు అయ్యే ఖర్చులు, ఛార్జీలు మీ వద్ద నుండి వసూలు చేయబడునని అని మీకు తెలియపరచడమైనది.
6. దిగువ పునరుత్పత్తి చేయబడిన ఆదాయపు పన్ను చట్టం, 1961 లోని రెండవ షెడ్యూల్ నందు రూల్ 16 ని చూడండి.
   16(1) రూల్ 2 ప్రకారం డిఫాల్టర్‌పై నోటీసు అందజేసినట్లయితే డిఫాల్టర్ లేదా అతని ప్రతినిధి వడ్డీకి తనఖా పెట్టడానికి, ఛార్జ్ చేయడానికి, లీజుకు లేదా రికవరీ అనుమతితో తప్ప అతనికి సంబంధించిన ఏదైనా ఆస్తితో వ్యవహరించడానికి సమర్థుడు కావు. అధికారి లేదా ఏదైనా సివిల్ కోర్టు డబ్బు చెల్లింపు కోసం డిక్రీని అమలు చేయడంలో అటువంటి ఆస్తికి వ్యతిరేకంగా ఎటువంటి ప్రక్రియను జారీ చేయరాదు.
   16(2) ఈ షెడ్యూల్ ప్రకారం అటాచ్‌మెంట్ చేయబడినప్పుడు అటాచ్ చేసిన ఆస్తి యొక్క ఏదైనా ప్రైవేట్ బదిలీ లేదా డెలివరీ లేదా అందులో ఏదైనా వడ్డీ మరియు అటువంటి అటాచ్‌మెంట్‌కు విరుద్ధంగా ఏదైనా ఋణం, డివిడెండ్ లేదా ఇతర డబ్బులను డిఫాల్టర్‌కు చెల్లించడం చెల్లదు. అటాచ్‌మెంట్ క్రింద అమలు చేయగల అన్ని క్లెయిమ్‌లకు వ్యతిరేకంగా ఉంటుంది.

(నా స్వహస్తములతో మరియు ఈ ట్రిబ్యునల్ యొక్క ముద్రతో తేది.27 అక్టోబరు, 2023 న ఇవ్వబడినది)

(అవసరాల అనిల్)
రికవరీ ఆఫీసర్
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం

చిచ్చర పిడుగులం

చిన్నారి బాలలం
చిట్టిపొట్టి పిల్లలం..
చిరుకాంతుల దివ్వెలం..!
చదువు సంధ్యల్లో మేం
చాలా చక్కని మెరికలం!
చిన్ని చిన్ని అల్లర్లతో
అలరించే.. పలవరించే..
చిచ్చర పిడుగులం..!
అమ్మనాన్నలకు మేం
నవ్య కాంతులం
తొలకరి చినుకులం
లేలేత చిగురులం
పూబోణి మొగ్గలం
నిత్య సంతోషాన్నిచ్చే..
నింగిలోని చుక్కలం..
ఆటల్లో మేం.. ఆరితేరినాం..
అన్నిమరచి ఆనందంలో
మునిగి తేలుతాం..!
పాటల్లో మేం..
వీణా తంత్రులం..
గాన గంధర్వులం..
చేతల్లోనేమో..
చిచ్చర పిడుగులం..
చాచా నెహ్రూ
గుండెల్లో మేం..
పసిమిదేరిన పువ్వులం
పండు వెన్నెల నవ్వులం
హే.. మేమేలే రేపటి..
భావి భారత పౌరులం
భరతమాత బిడ్డలం..!

- ప్రజ్ఞ

లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మలను అంకెలుగా గణించి లెక్క చేశాం. చివరి వరుస సమాధానం మీరు రాబట్టండి చూద్దాం.



నేను గీసిన బొమ్మ

ఆర్.గణేష్
5వ తరగతి
దిగువ సాంబయ్య పాళెం
తొట్టంబేడు మండలం
తిరుపతి జిల్లా

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఒకే ఒక్క చేతితో లక్షన్నర పుస్తకాలు!

తరతరాల విజ్ఞాన సంపాదన వివరించేవి గ్రంథాలయాలే. అలాంటిది లక్షా 50 వేలకు పైగా పుస్తకాలను సేకరించిన వ్యక్తి మన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఒక్కరంటే ఒక్కరు ఉన్నారు. ఆయన పేరు లంకా సూర్యనారాయణ. గుంటూరుకు చెందిన ఆయన వద్ద శతాబ్దాల క్రితం నాటి తాళపత్ర గ్రంథాల నుంచి నేటి ఆధునిక టెక్నాలజీకి సంబంధించిన వివిధ సబ్జెక్టులు, కళలు, సాహిత్యం, విద్య, వైద్యం, ఆరోగ్యం, సినిమా వంటి రంగాలకు చెందిన వేలాది పుస్తకాలూ ఉన్నాయి. సమాజం, ప్రకృతి, పర్యావరణం, ప్రపంచ విజ్ఞానాన్ని అన్ని కోణాల్లో వీక్షించగల సత్తా కలిగిన పుస్తకాలెన్నో ఆయన వద్ద ఉన్నాయి. ఆయన ఇల్లు కూడా పుస్తకాలతో నిండిన సువిశాల భవనం. నాటి నుంచి నేటి వరకూ 88 ఏళ్లప్రాయంలో కూడా అదే స్ఫూర్తితో పుస్తకాల సేకరణ ప్రవృత్తిని కొనసాగిస్తున్నారు. ఎపి లైబ్రరీ మ్యాన్‌గా పిలువబడుతున్నారు. తను సేకరించిన గ్రంథాలను కొన్ని ఉచితంగా చదువుకోవటానికి ఇవ్వటంతోపాటు ఆన్‌లైన్‌లో పీడిఎఫ్ పేజీలు పంపించటానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు.

గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడుకు చెందిన లంకా పెద లక్ష్మీనారాయణ, శ్రీ రంగనాయకమ్మ దంపతులకు సూర్యనారాయణ ఆగస్టు 23, 1936లో జన్మించారు. 1956లో కస్టమ్స్ సెంట్రల్ ఎక్సైజ్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగంలో చేరారు. 1992లో సూపరింటెండెంట్‌గా ఉద్యోగ విరమణ పొందారు.

చిన్నప్పటి నుంచీ పుస్తకాల సేకరణ

చిన్నప్పటి నుంచే పుస్తకాల సేకరణను వ్యాపకంగా మార్చుకున్నారు సూర్యనారాయణ. సంపాదనలో కొంత భాగాన్ని పుస్తకాల కొనుగోలుకు వెచ్చించేవారు. పదుల సంఖ్య నుంచి లక్షకుపైగా పుస్తకాలు చేరటంతో ఇంటినే గ్రంథాలయంగా మార్చారు. నేటికీ ప్రతిరోజూ ఎక్కువ సమయాన్ని ఈ గ్రంథాలయంలోనే గడుపుతారు. గ్రంథాలయ అధికారి సుభాషిణి నలజాల, మరో సహాయకుడు పాఠకులకు సేవలందిస్తున్నారు.

వేల పుస్తకాల భాండాగారం

ఓ వ్యక్తి జీవితకాల కృషికి నిలువెత్తు నిదర్శనమైన ఈ పుస్తక భాండాగారాన్ని అనునిత్యం వందలాది మంది సందర్శించి వెళ్తుంటారు. మంచి పుస్తకమైనా, వ్యాసమైనా చదివితే దానిని సేకరించటానికి ఖర్చుకు సైతం వెనుకాడని నైజం సూర్యనారాయణది. ఈ తపనతోనే వేలాది పుస్తకాలు సేకరించగలిగానని ఆయన గర్వంగా చెబుతారు.

అన్నమయ్య గ్రంథాలయంలోకి మార్పు

సూర్యనారాయణ సేకరించిన పుస్తక సంపద అంతా 2008లో గుంటూరులోని బృందావన్ గార్డెన్స్‌లోని కంచి కామకోటి పీఠ శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవాలయానికి సమర్పించారు. 2011లో నూతనంగా నిర్మించిన ధార్మిక విజ్ఞాన ప్రాంగణంలోని నూతన భవనంలోకి మార్చారు. ఈ పుస్తక సంపదను

చూసిన టిటిడి ప్రతినిధులు ఆర్థిక సహకారం అందించారు. అయితే నాటి నుంచి ప్రభుత్వాల సహకారం సరిగ్గా లేకపోవటంతో గ్రంథాలయ నిర్వహణలో ఆర్థిక సమస్యలు తలెత్తుతున్నాయి.

అపురూపమైన పుస్తక సంపద

అన్నమయ్య గ్రంథాలయం పుస్తకాల్లో తెలుగులో భగవద్గీత, రామాయణం, భాగవతం, ఉపనిషత్తులు, వేదాలు, అనేక కవితా సంకలనాలు, నాటకాలు, సంగీతం, చిత్రకళ, నిఘంటువులు, జీవిత చరిత్రలు, ట్రావెల్, చరిత్ర, హాస్యం, సూక్తులు, దేశభక్తి, నవలలు, స్టాంపులు, కాఫీటేబుల్ బుక్స్, గ్రంథాలయ సమాచార శాస్త్ర గ్రంథాలయాలు, జర్నలిజం మొదలైన 161 సబ్జెక్టులలోనూ, ఇంగ్లీషులో మరొక 100 సబ్జెక్టు పుస్తకాలు గ్రంథాలయం మూడు అంతస్తుల్లో అమరి ఉన్నాయి. మొత్తం 1,40,346 పుస్తకాలున్నాయి. అందులో 97,510 తెలుగు; 41,688 ఇంగ్లీషు, 1148 హిందీ, సంస్కృతం, తమిళం, కన్నడ పుస్తకాలు ఉన్నాయి. ఇవేకాకుండా తెలుగు పత్రికలు 1091, ఇంగ్లీషు 1155, హిందీ, సంస్కృతం పత్రికలు 25 మొత్తం 2271 తెలుగు, ఇంగ్లీష్ పత్రికల టైటిళ్లు, 500 బౌండ్లు (పత్రికల కత్తిరింపులు–ఒక్కొక్క పుస్తకం సుమారుగా 400 పేజీలు), మరెన్నో దినపత్రికల కత్తిరింపులు (4 లక్షలకుపైగా) అందరికీ అందుబాటులో ఉంచటం సరికొత్త రికార్డే. వీటిలో పాఠకులు ఏ పుస్తకం అడిగినా మూడు నిముషాల్లో వారి ముందుంచేలా ఒక క్రమపద్ధతిలో వాటిని అమర్చటం విశేషం. సాంకేతిక పరిజ్ఞానాన్ని, వినియోగించి గ్రంథాలయంలోని పుస్తకాలను డిజిటలైజ్ చేసే పక్రియ కొనసాగుతోంది. ఆ వివరాల క్యాటలాగ్ అంతర్జాలంలో 'అన్నమయ్య గ్రంథాలయం–వికీపీడియా'పేజీలో ఉంది. ఇక్కడ పుస్తక ప్రియులు కోరిన పుస్తకాన్ని స్కాన్ చేసి పెన్‌డ్రైవ్‌లో ఇస్తారు. స్థానికేతరులు ఫోన్ ద్వారా (0863–2246365) సంప్రదిస్తే కావాల్సిన పుస్తకం సాఫ్ట్ కాపీని ఈ మెయిల్ ద్వారా అందుకునే వీలుంది. ఎవరైనా పుస్తకం తీసి చదివినా తిరిగి ఎక్కడ తీసింది అక్కడ పెట్టడానికి వీల్లేదు. కింద పెట్టాల్సిందే. సిబ్బందే వాటి నమూనా సంఖ్య ఆధారంగా తిరిగి సర్దేయటం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. తద్వారా పాఠకులు తిరిగి ఆయా పుస్తకాలు సులభంగా పొందే ఏర్పాట్లు చేశారు.

పరిశోధకులకు డాక్టరేట్లు

తెలుగు, ఇంగ్లీషు డిక్షనరీలు, ఆటో బయోగ్రఫీలు, బయోగ్రైడ్స్, కాఫీ టేబుల్ బుక్స్, నాటకాలు, సినిమాలు, రామాయణానికి సంబంధించి సుమారు గ్రంథాలు, భాగవంతం, భారతం, శ్రీమద్భగద్గీత తెలుగు ఇంగ్లీషు మీడియంలలో కూడా లభిస్తున్నాయి. ఇవి అనేకమంది సాహిత్య పరిశోధకులకు తులనాత్మక పరిశీలన చేసే అవకాశం కల్పిస్తున్నాయి. అరుదైన కొన్ని పుస్తకాలను ఇక్కడి నుంచి తీసుకుని పునర్ముద్రణ జరిపిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. సుమారు 60 ఏళ్ల నుంచి వెలువడిన వివిధ దినపత్రిలకు వీరు భద్రపర్చారు. గ్రంథాలయాన్ని ఉపయోగించుకుని 30 మంది డాక్టరేట్లు పొందారు. మరికొందరు పరిశోధనలను ఇక్కడే కొనసాగిస్తున్నారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు లావు నాగేశ్వరరావు, జాస్తి చలమేశ్వరరావు తదితరులు గ్రంథాలయాన్ని సందర్శించి సూర్యనారాయణ కృషిని ప్రత్యేకంగా అభినందించారు. సూర్యనారాయణ కృషికి గుర్తింపుగా 2015లో రాష్ట్రప్రభుత్వం ఉగాదికి కళారత్న (హంస), 2017లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తిపురస్కారం బహూకరించాయి. పలు సంస్థలు, ట్రస్టులు పలు సన్మానాలు, అవార్డులు ప్రదానం చేశాయి.

-యడవల్లి శ్రీనివాసరావు

ఫొటోలు : టివి రమణ



'లాల్ సలామ్' టీజర్ విడుదల

దీపావళి సందర్భంగా రజినీకాంత్ నటిస్తున్న 'లాల్ సలామ్' చిత్రం నుంచి చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. ముంబై వంటి సెన్సిటివ్ ప్రాంతంలో హిందువులు, ముస్లిముల మధ్య ఘర్షణలు జరిగినప్పుడు జరిగిన నష్టం ఏంటి? క్రికెట్‌ను ఎంతగానో ప్రేమించే ఇద్దరు యువకులు.. వారిలో ఒకరు హిందు, మరొకరు ముస్లిం. క్రికెట్ ఆటలో ఒకరిపై ఒకరు పోటీ పడే సన్నివేశాలు, దాని వల్ల వారిద్దరూ మతం పేరుతో గొడవలు పడే సన్నివేశాలను ఈ టీజర్‌లో చూపించారు. 'ఆటలో మతాన్ని చేర్చారు. అంతే కాకుండా పిల్లల మనసుల్లో విషాన్ని నింపారు' అని అక్కడున్న పెద్దలను మొయిద్దీన్ పాత్ర తిడుతుంది. అలాగే హిందు, ముస్లిలు గొడవ పడుతున్నప్పుడు.. మొయిద్దీన్ భాయ్ ఆ ప్రాంతంలో శాంతి కోసం ఏం చేశారనే కథాంశంతో ఈ చిత్రం రూపొందిందని టీజర్ చూస్తుంటే అర్థమవుతుంది. మెయిద్దీన్ పాత్రలో రజినీకాంత్ కనిపించనున్నారు. తమిళ, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా విడుదలకాబోతోంది. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని ఐశ్వర్య రజినీకాంత్ డైరెక్ట్ చేస్తున్నారు. రజినీకాంత్ కీలక పాత్రలో నటిస్తోన్న ఈ చిత్రంలో విష్ణు విశాల్, విక్రాంత్, జీవితా రాజశేఖర్, కపిల్ దేవ్ తదితరులు నటించారు.

త్వరలో 'సైంధవ్' ఫస్ట్ సింగిల్

వెంకటేష్, శైలేష్ కొలను, వెంకట్ బోయనపల్లి, నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్స్ నుండి రాబోతున్న చిత్రం 'సైంధవ్'. ఈ చిత్రం నుండి ఫస్ట్ సింగిల్ అప్డేట్ వచ్చింది. వెంకటేష్ కెరియర్‌లో 75వ చిత్రంగా రాబోతున్న ఈ సినిమా నుండి నవంబర్ 21న ఫస్ట్ సింగిల్ రానుంది. దీనికి సంబంధించి చిత్రబృందం ఓ పోస్టర్ విడుదలచేశారు. ఈ సాంగ్ పోస్టర్‌లో వెంకటేష్ డ్యాన్సర్‌లతో కలిసి డ్యాన్స్ చేస్తున్నట్లు కనిపించారు. సంతోష్ నారాయణన్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. ఎస్.మణికందన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. జనవరి 13, 2024న అన్ని దక్షిణ భారత భాషలు, హిందీలో ఈ సినిమా విడుదల కానుంది.

నందమూరి చైతన్యకృష్ణ హీరో 'బ్రీత్'

తన తనయుడు చైతన్య కృష్ణ హీరోగా నందమూరి జయకృష్ణ నిర్మిస్తున్న తొలి సినిమా 'బ్రీత్'. వైద్యో నారాయణో హరి అనేది ఉపశీర్షిక. వైదిక సెంజలియా కథానాయిక. తాజాగా చిత్ర బృందం ట్రైలర్ విడుదల చేసింది. వంశీకృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

'ఈగల్' కాన్సెప్ట్ పోస్టర్ విడుదల

రవితేజ కొత్త ప్రాజెక్టు 'ఈగల్' కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లో వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దీపావళి సందర్భంగా ఈ చిత్రం నుండి చిత్రబృందం కాన్సెప్ట్ పోస్టర్‌ని విడుదల చేసింది. మణిబాబు కరణం ఈ సినిమాకి మాటలు అందించారు. 2024 సంక్రాంతి కానుకగా జనవరి 13న ఈ చిత్రం అన్ని దక్షిణ భారత భాషల్లో, హిందీలో విడుదల కానుంది.

14న 'హనుమాన్' పాట

ప్రశాంత్ వర్మ, తేజ సజ్జా కాంబినేషనల్లో వస్తోన్న 'హను–మాన్' చిత్రం నుండి ఓ పాటకు సంబంధించిన అప్డేట్‌ని తాజాగా చిత్రబృందం విడుదల చేసింది. బాలల దినోత్సవం సందర్భంగా ఈ నెల 14న సాయంత్రం ఈ పాట విడుదల కానుందని తెలుపుతూ, ఓ పోస్టర్ విడుదల చేశారు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె నిరంజన్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అమృత అయ్యర్ కథానాయికగా నటిస్తుండగా, వినయ్ రాయ్ విలన్‌గా, వరలక్ష్మి శరత్‌కుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. గౌరహరి, అనుదీప్ దేవ్, కృష్ణ సౌరభ్ త్రయం సంగీతం అందించారు. శ్రీమతి చైతన్య సమర్పిస్తున్నారు. జనవరి 12, 2024న తెలుగు, హిందీ, మరాఠీ, తమిళం, కన్నడ, మలయాళం, ఇంగ్లీష్, స్పానిష్, కొరియన్, చైనీస్, జపనీస్‌తో సహా పలు భారతీయ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

'హరోం హర' తాజా కబురు



జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుధీర్ బాబు చేస్తున్న తాజా చిత్రం 'హరోం హర'. ఎస్ఎస్‌సి (శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్) బ్యానర్‌పై సుమంత్ జి నాయుడు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి కావస్తోంది. నవంబర్ 22న ఈ చిత్రం నుండి 'పవర్ ఆఫ్ సుబ్రమణ్యం'ను విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా ఓ పోస్టర్ విడుదల చేశారు. చిత్తూరు జిల్లా కుప్పంలో 1989 నాటి నేపథ్యంలో సాగే ఈ కథలో సుధీర్ బాబు కుప్పం యాసలో డైలాగులు పలకనున్నారు. ప్రముఖ సాంకేతిక నిపుణులు ఈ చిత్రానికి పని చేస్తున్నారు. అరవింద్ విశ్వనాథన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. చైతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

భారత్ ప్రత్యర్థి న్యూజిలాండ్

- **వన్డే ప్రపంచకప్‌లో తొలిసారి వరుసగా 9విజయాలతో రికార్డు**
- **8వ సారి సెమీస్‌కు టీమిండియా..**

ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా నయా చరిత్ర లిఖించింది. ఆదివారం నెదర్లాండ్స్‌పై 160పరుగుల తేడాతో నెగ్గిన టీమిండియా ఈ టోర్నీలో వరుస విజయాల సంఖ్య 9కి చేరింది. దీంతో టీమిండియా 2003లో వరుసగా నెగ్గిన విజయాల సంఖ్య 8ను బ్రేక్ చేసి నయా చరిత్ర సృష్టించింది. ఇదే క్రమంలో ఆస్ట్రేలియా 2007, 2003లో వరుసగా 11 మ్యాచుల్లో నెగ్గిన రికార్డు దిశగా పయనిస్తోంది. రోహిత్ శర్మ సారథ్యంలో భారతజట్టు గ్రూప్ స్టేజ్‌లో ఆడిన 9 మ్యాచుల్లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఆడిన తొమ్మిది మ్యాచ్‌లలో తొమ్మిదింటిలో గెలిచి అపజయమే లేని జట్టుగా నిలిచింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా నెదర్లాండ్స్‌తో ఆదివారం నెదర్లాండ్స్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో మ్యాచ్‌లో టీమిండియా ఏకంగా 160 పరుగుల భారీ తేడాతో గెలిచింది. టీమిండియా నిర్దేశించిన 411పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో నెదర్లాండ్స్ జట్టు 47.5 ఓవర్లలో 250 పరుగులకే కుప్పకూలింది. బ్యాటింగ్‌లో అదరగొట్టిన టీమిండియా.. బౌలింగ్‌లో కూడా రాణించి తొమ్మిదో విజయాన్ని నమోదుచేసుకుంది. ఒక వరల్డ్ కప్ ఎడిషన్‌లో వరుసగా తొమ్మిది మ్యాచ్‌లు గెలవడం టీమిండియాకు ఇదే తొలిసారి. కాగా ఈ మ్యాచ్‌తో వరల్డ్ కప్‌లో లీగ్ దశ పోటీలు ముగిశాయి. నవంబర్ 15 నుంచి నాకౌట్ మ్యాచ్‌లు మొదలవుతాయి. భారత్ నిర్దేశించిన 411 పరుగుల ఛేదనలో నెదర్లాండ్స్‌కు గెలుపు మీద ఆశలేమీ లేకున్నా బ్యాటింగ్‌కు అనుకూలించే బెంగళూరు పిచ్‌పై కాస్త ప్రతిఘటించింది. ఓపెనర్ వెస్లీ బరెసి (4)ని సిరాజ్ రెండో ఓవర్లోనే ఔట్ చేశాడు. మరో ఓపెనర్ మ్యాక్స్ ఓడౌడ్ (30), కొలిన్ అకర్‌మన్ (35) లు రెండో వికెట్‌కు 61 పరుగులు జోడించారు. అయితే అకర్‌మన్‌ను కుల్‌దీప్ ఔట్ చేసి భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే జడ్డూ.. ఓడౌడ్‌ను పెవిలియన్ కు పంపాడు. 72కే మూడు వికెట్లు కోల్పోయిన నెదర్లాండ్స్ ను సిబ్రండ్.. (80 బంతుల్లో 45) కాస్త ప్రతిఘటించాడు. ఎడ్వర్డ్స్ (17) తో కలిసి కొంతసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. అయితే కోహ్లీ.. ఎడ్వర్డ్స్ వికెట్ తీసి డచ్ టీమ్‌కు భారీ షాకిచ్చాడు. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లలో ఆంధ్రా మూలాలున్న తేజ నిడమనూరు (39 బంతుల్లో 54, 1 ఫోర్, 6 సిక్సర్లు) ఒక్కడే కాస్త రాణించాడు. అర్థ సెంచరీ పూర్తిచేసిన అతడిని రోహిత్ శర్మ 48వ ఓవర్లో ఔట్ చేయడంతో నెదర్లాండ్స్ కథ ముగిసింది.

తొమ్మిది మంది బౌలర్లతో తొలిసారి...

ఈ మ్యాచ్‌లో భారత్ తొమ్మిది మంది బౌలర్లతో బౌలింగ్ చేయించింది. వికెట్ కీపర్ కెఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ మినహా మిగిలిన 9 మంది బౌలింగ్ చేయడం విశేషం. వన్డే వరల్డ్ కప్ లో ఒక జట్టు 9 మంది బౌలర్లను వాడటం ఇది మూడోసారి మాత్రమే. గతంలో 1987లో ఇంగ్లండ్.. శ్రీలంక మ్యాచ్‌లో ఇంగ్లీష్ జట్టు 9 మంది బౌలర్లతో బౌలింగ్ చేయించింది. 1992లో న్యూజిలాండ్.. పాకిస్తాన్‌పై 9 మందితో బౌలింగ్ వేయించింది. సింగిల్ వరల్డ్ కప్ ఎడిషన్‌లో అత్యధిక విజయాలు సాధించిన జట్లలో భారత్.. ఆస్ట్రేలియా తర్వాత రెండో స్థానంలో నిలిచింది. ఆస్ట్రేలియా 2003, 2007లలో వరుసగా 11 మ్యాచ్‌లలో గెలిచింది. ఆ తర్వాత 9 విజయాలతో (ఈ వరల్డ్ కప్‌లో) భారత్ ఉంది. 2003లో భారత్.. వరుసగా 8 మ్యాచ్‌లు గెలుచుకుంది.

సెమీఫైనల్స్ వర్షంతో రద్దయితే..

వన్డే ప్రపంచకప్ రెండు సెమీఫైనల్ మ్యాచ్ లకూ రిజర్వ్ డేలు ఉన్నాయి. ఒకవేళ బుధవారం వర్షం కారణంగా ఆట సాగకపోయినా గురువారం మ్యాచ్ నిర్వహిస్తారు. గురువారం కూడా ఆట సాధ్యం కాకుంటే మాత్రం పాయింట్ల పట్టిక ఆధారంగా విజేతను నిర్ణయిస్తారు. అలా జరిగితే టాప్‌లో ఉన్న భారత్ ఫైనల్‌కు చేరనుంది. లీగ్ దశలో భారత్ ఆడిన తొమ్మిదింటిలో తొమ్మిది గెలిచిన భారత్.. 18 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. కివీస్ 9 మ్యాచ్‌లలో ఐదు గెలిచి 4వ స్థానంలో ఉంది. ఇదే విధంగా దక్షిణాఫ్రికాజట్టు మెరుగైన రన్‌రేట్ ఆధారంగా 3వ స్థానంలో ఉండడంతో ఆ జట్టు ఫైనల్‌కు చేరనుంది.

- స్పోర్ట్స్ డెస్క్

సెమీస్‌కు అంపైర్లు వీరే: ఐసిసి

రాడ్ టక్కర్

ఇల్లింగ్‌వర్త్

మీనన్

కెటెల్‌బ్రో

దుబాయ్: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో గ్రూప్ స్టేజ్ పోటీలు ముగిసాయి. 45 లీగ్ మ్యాచ్‌లు ముగిసిన అనంతరం అగ్రస్థానంలో ఉన్న భారతజట్టు 4వ స్థానంలో ఉన్న న్యూజిలాండ్‌తో బుధవారం తొలి సెమీస్, 2, 3 స్థానాల్లో ఉన్న దక్షిణాఫ్రికా–ఆస్ట్రేలియా జట్ల మధ్య రెండో సెమీఫైనల్ పోరు జరగనుంది. ఈ క్రమంలో అంతర్జాతీయ క్రికెట్‌మండలి(ఐసిసి) సెమీఫైనల్‌కు అధికారిక అంపైర్లును వెల్లడించింది. భారత్–న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగే తొలి సెమీస్‌కు రాడ్ టక్కర్, రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్ ఫీల్డ్ అంపైర్లుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. భారత్–న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగే తొలి సెమీస్‌తో అంపైర్ టక్కర్ అంపైర్ కెరీర్‌లో 100వ మ్యాచ్‌కు బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. ఇక దక్షిణాఫ్రికా–ఆస్ట్రేలియా జట్ల మధ్య 16(గురు)న జరిగే రెండో సెమీస్‌కు నితిన్ మీనన్–రిచర్డ్ కెటెల్‌బ్రో ఫీల్డ్ అంపైర్లుగా ఉండనున్నారు. తొలి సెమీస్‌కు ముంబయి, రెండో సెమీస్‌కు కోల్‌కతాలో జరగనున్నాయి. ఇల్లింగ్‌వర్త్ 2019 వన్డే ప్రపంచకప్ భారత్–న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన సెమీస్‌కు బాధ్యతలు నిర్వర్తించారు.

పాయింట్ల పట్టిక

వ.స.	దేశం	ఆ	గె	ఓ	పా	నె.ర.
1.	భారత్	9	9	0	18	+2.57
2.	దక్షిణాఫ్రికా	9	7	2	14	+1.26
3.	ఆస్ట్రేలియా	9	7	2	14	+0.84
4.	న్యూజిలాండ్	9	5	4	10	+0.74
5.	పాకిస్తాన్	9	4	5	8	-0.19
6.	ఆఫ్ఘనిస్తాన్	9	4	5	8	-0.33
7.	ఇంగ్లండ్	9	3	6	6	-0.57
8.	బంగ్లాదేశ్	9	2	7	4	-1.08
9.	శ్రీలంక	9	2	7	4	-1.41
10.	నెదర్లాండ్స్	9	2	7	4	-1.82

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర:నెట్‌రన్‌రెట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68